అనుదినం.. జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
స్వాతంత్ర్య దినోత్సవ & వార్షికోత్సవం
9th ANNIVERSARY CELEBRATIONS 2015-2024 August 01 to 31
78th Happy Independence Day
ప్రత్యేక సంచిక
గురువారం । 15 ఆగస్టు - 2024 । నిజామాబాద్-కామారెడ్డి 12
www.navatelangana.com

వేడుకలకు సర్వం సిద్ధం

- స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఇరు జిల్లాల్లో ఏర్పాట్లు పూర్తి
- నిజామాబాద్‌లో జెండా ఎగురవేయనున్న ఈరవత్రి అనిల్
- కామారెడ్డిలో ఆవిష్కరించనున్న పటేల్ రమేశ్‌రెడ్డి


నిజామాబాద్‌లో ముస్తాబైన పోలీస్ పరేడ్‌గ్రౌండ్

నవతెలంగాణ-నిజామాబాద్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకునేందుకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సర్వం సిద్ధమైంది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పరేడ్‌గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈసారి పతాకావిష్కరణకు ముఖ్య అతిథిగా రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

అదే విధంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఇందిరా గాంధీ స్టేడియాన్ని జిల్లా యంత్రాంగం ముస్తాబు చేసింది. టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి జాతీయ పతకాన్ని ఆవిష్కరించనున్నారు. కాగా కామారెడ్డికి చెందిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మైనార్టీ వెల్ఫేర్ సలహాదారు షబ్బీర్‌అలీ ఆదిలాబాద్‌లో నిర్వహించనున్న వేడుకల్లో పాల్గొననున్నారు.

పోలీస్ బందోబస్తు..

స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని పోలీస్‌శాఖ తరపున భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో సీపీ కల్మేశ్వర్ సింగనారే, కామారెడ్డిలో జిల్లా ఎస్పీ సింధు శర్మ ఆధ్వర్యంలో పోలీస్ యంత్రాంగం బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. పలు కేంద్రాలకు అదనపు బలగాలతో గస్తీ చేపట్టనున్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నవతెలంగాణ

కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి



ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నవ తెలంగాణ పత్రిక నిలుస్తోంది. దినపత్రిక తొమ్మిదేళ్ల పూర్తి చేసుకొని పదవ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా పత్రిక ఉద్యోగులకు, విలేకరులకు, సిబ్బందికి, పాఠకులకు శ్రేయోభిలాషులకు 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు. ప్రజా సమస్యలను ప్రజావాణి కార్యక్రమం ద్వారా తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు పరిష్కారానికి చర్యలు తీసుకుంటు న్నాము. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాము. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో మీడియా తన వంతు పాత్ర పోషించాలి.

చివరి దశలో అమ్మ ఆదర్శ పనులు

- పిఆర్‌డిఈ కిషన్ నాయక్

నవతెలంగాణ-ఆర్మూర్



పంచాయతీ రాజ్ సబ్ డివిజన్‌లోని నందిపేట్, మాక్లూర్, ఆర్మూర్‌లలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ఐదు కోట్ల 7వేలతో పనులు కొనసాగుతున్నట్టు డివిజనల్ పంచాయతీరాజ్ డిఈ కిషన్ నాయక్ బుధవారం తెలిపారు. 110లో 104 పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నావని అన్నారు. అంగన్వాడి బిల్డింగ్‌లకు సబ్ డివిజన్ పరిధిలో మరమ్మత్తులకు నిధులు వచ్చినట్టు తెలిపారు. 31 అంగన్వాడీలకు ఒక్కొక్కటికి 17వేల చొప్పున 5లక్షల 27 వేలు, టాయిలెట్ల మరమ్మతుకు 36వేలు నిధులు వచ్చాయన్నారు. నందిపేట మండలంలోని 22 పాఠశాలలకు గాను 18 పూర్తి అయినట్టు, డొంకేశ్వర్ లో 16 పాఠశాలలకు గాను 15 పాఠశాలల్లో పనులు నడుస్తుండగా 8 పూర్తి అయినట్టు చెప్పారు. ఆలూర్‌లో 9 పాఠశాలలకు గాను 8 పూర్తయినట్టు ఆర్మూర్‌లో 25 పాఠశాలలకు గాను 24 స్కూళ్లలో పనులు నడుస్తుండగా, 18 పూర్తి అయినట్టు, మాక్లూర్ మండలంలో 38 పాఠశాలలకు కాను 35లో పనులు నడుస్తుండగా 25 పాఠశాలల్లో పనులు పూర్తయినట్టు తెలిపారు.

ఉన్నది ఉన్నట్టు రాయడం నవతెలంగాణకే సాధ్యం

- ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఎలాంటి కట్టుకథలు లేకుండా ఉన్నట్టు ఉన్నట్టు వార్తలు రాయడం నవతెలంగాణ దినపత్రికకే సాధ్యం. అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులకు సంబంధించిన వార్తలు రాస్తూ ముందంజలో ఉంది. నవతెలంగాణ నలుమూలల విస్తరించాలి. 9వ వార్షికోత్సవం జరుపుకుంటున్న పత్రిక విలేకరులకు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు, శుభాకాంక్షలు.

నవతెలంగాణది నిష్పక్షపాత ధోరణి

- తహసీల్దార్ నారాయణ

నవతెలంగాణ-నవిపేట్



జర్నలిజంలో నవ తెలంగాణ పత్రిక నిష్పక్షపాతంగా ప్రజల కోసం వార్తలు అందించడంలో ముందంజలో ఉంది. డే బై డే అప్డేట్ న్యూస్ చాలా బాగా వస్తున్నా యి. ఈ సందర్భంగా 9 వ వార్షికోత్సవం జరుపుకుంటున్న నవ తెలంగాణకు ప్రత్యేక శుభాకాంక్షలు భవిష్యత్తులో ప్రజల పక్షాన నిలబడుతూ మరింత ప్రాచుర్యం పొందాలని ఆకాంక్షిస్తున్నాను.

వాస్తవాలు ప్రజలు, అధికారుల ముందుకు

- ఎంపిఓ రాజ్‌కాంత్ రావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



అనునిత్యం ప్రజల పక్షాన ఉంటూ గ్రామీణ ప్రాంత ప్రజల సాధక బాధకాలను జరిగిన వాస్తవాలు ప్రజల, అధికారుల ముందుకు తీసుకొని వస్తూ సమాచారాన్ని ప్రజలకు అందజేస్తుంది. రాబోవు రోజుల్లో ఈ పత్రిక మరింత ప్రజలకు చేరువై గ్రామీణ ప్రాంతం నుండి మొదలుకొని దేశం మొత్తంలో వివిధ భాషల్లో ఉండాలని కోరుకుంటున్నాను. ఏ సమస్య ఉన్న అధికారుల దృష్టికి తీసుకుని వెళ్తారు.. ఎక్కడైనా ఏదైనా సంఘటన చోటు చేసుకుంటే అక్కడ నవతెలం గాణ విలేకరి ఉంటారు. నవ తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలి. 9వ వార్షికోత్సవం జరుపుకుంటున్న శుభ సందర్భంగా యజమాన్యానికి, విలేకరులకు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు, శుభాకాంక్షలు.

ఆరుగ్యారంటీలతో చరిత్రలో సీఎం రేవంత్‌రెడ్డి

- కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి

నవతెలంగాణ-మోపాల్



నవ తెలంగాణ సిబ్బందికి వార్షికోత్సవ శుభాకాంక్షలు. మోపాల్ పేరుకి మండలంగా ఏర్పాటయింది తప్ప గత ప్రభుత్వం ఎక్కడ కూడా ఒక ప్రభుత్వ భవనం కూడా నిర్మించలేదు. మంచిప్ప గ్రామానికి చుట్టుపక్కల తాండవాసులకు తీవ్రంగా అన్యాయం చేసి ముంపు గ్రామంగా ప్రకటించి నిరంతరం వారికి నరకాయాతన చూయించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం, కర్షక ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పాత డిజైన్ ప్రకారమే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పనులు కొనసాగుతాయని ఎమ్మెల్యే భూపతి రెడ్డి చెప్పారన్నారు. ఆయన ఆధ్వర్యంలో మోపాల్ మండలం అభివృద్ధి బాటలో పయణిస్తుంది. నెల క్రితమే దాదాపు 28 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. ముఖ్యంగా ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, రైతన్నలకు రుణమాఫీ చేస్తూ రాజశేఖర్ రెడ్డి లాగా సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో మిగిలిపోతారు. ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తామని రూరల్ నియోజకవర్గం లోని మోపాల్ మండలాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారిన చెప్పారు. ఇప్పటికే చాలామంది సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కూడా అందజేశారు. యువతకు పెద్దపీట వేస్తూ జాబ్ క్యాలెండర్‌ను కూడా రిలీజ్ చేస్తున్నారు. పనిచేసే ప్రభుత్వం ఏదో యువత ఆలోచించాలి. ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి నాయకత్వాన్ని, కాబోయే మంత్రివర్యులు బోధన్ శాసనసభ్యులు పి సుదర్శన్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి. అప్పుడే గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

ప్రజల పక్షాన ప్రశ్నించే గళం

- ఛాతి వైద్య నిపుణులు, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ బొద్దుల రాజేంద్ర ప్రసాద్

నవతెలంగాణ-కంఠేశ్వర్



ప్రజల పక్షాన ఉంటూ ప్రశ్నించే గళం వినిపించే పత్రిక నవ తెలంగాణ దినపత్రిక. నిరంతరం ప్రజల శ్రేయస్సును కోరే పత్రిక. అన్ని వర్గాల ప్రజలను ఒకే తాటిపైకి తీసుకువచ్చి సమన్యాయం చేసే పత్రిక. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ఆటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు మధ్య వారాధిగా ఉంటు నిరంతరం ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొని పరిష్కారంలో ముందుంటున్న పత్రిక. ఇలాంటి పత్రిక పాఠకులకు మరింత దగ్గర అవ్వాలి. విజయవంతంగా 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నవ తెలంగాణ తెలుగు దిన ప్రతిక కుటుంబ సభ్యులకు శుభా కాంక్షలు. భవిష్యత్‌లోనూ ఇలాంటి వార్షకోత్సవాలు జరుపుకోవాలి.

శ్రామిక వర్గాలకు అండ నవతెలంగాణ

- జంగం అశోక్ దళిత ఐక్య సంఘటన ఆర్మూర్ డివిజన్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



సమాజంలో అణగారిన, శ్రామిక వర్గాలకు అండ నవ తెలంగాణ. పేద, బడుగు, బలహీన వర్గాలకు ఎక్కడ ఏ స్థాయిలో అన్యాయం, వివక్ష జరిగిన వాటిని వెలికి తీసేది నవ తెలంగాణ పత్రిక. ఏ మారుమూలలనైనా ఎలాంటి విషయా లనైనా సమాజానికి తెలియజెప్పి నిర్భయంగా, నిర్మోహమాటంగా వార్తలు ప్రజలకు అందించే పత్రిక. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను దోపిడీ తదితర విషయాలను వార్తల రూపంలో ప్రజలకు తెలియజేసే పేదల పత్రిక. బలహీన వర్గాలకు అండదండగా ఉంటూ వారి అభ్యున్నతికి మార్గం చూపే పత్రిక నవ తెలంగాణ.

పేదలు, కార్మికుల పక్షాన పోరాడే పత్రిక

- నిజామాబాద్ నగర సిఐ నరహరి

నవతెలంగాణ-కంఠేశ్వర్



పేదల సమస్యలను నవ తెలంగాణ దిన పత్రిక ద్వారా ప్రచురితం చేసి అధికారులు, ప్రభుత్వం, సమాజం దృష్టి తీసుకురావడం, ఆ తర్వాత సమస్యలను పరిష్కరించే విధంగా వారు ప్రయత్నం చేయడం ఎంతో హర్షించదగ్గ విషయం. నిజాన్ని నిర్భయంగా, నిష్పక్షపాతంగా చాటుతున్నది నవ తెలంగాణ. ప్రజలు, కార్మికులు, కర్షకులు ప్రతి ఒక్కరూ చేసే పోరాటాలలో తన వంతుగా పనిచేస్తూ ప్రజలందరినీ చైతన్యం చేస్తూ ముందుకు తీసుకు వెళుతున్న పత్రిక నవ తెలంగాణ దినపత్రిక. సామాజిక న్యాయంతో అన్ని వర్గాల ప్రజలకు హక్కులు అందాలంటూ తనదైన శైలిలో వార్త కథనాలు అందించే పత్రిక. నవ తెలంగాణ నేడు తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా యాజమాన్యానికి, సిబ్బందికి, జర్నలిస్టులకు శుభాకాంక్షలు.

ఇంటి భోజనానికి కేరాఫ్

అమ్మ హోటల్



- మండలంలో యాభై ఏళ్ళుగా నడుస్తున్న ఏకైక హోటల్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలకేంద్రంలో ఐదు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసింది జీవన్ హోటల్. ఇంటి భోజనాన్ని మరిపిస్తూ హోమ్లీ టేస్ట్ హోటల్‌గా చుట్టు ప్రక్కల ప్రాంతాల్లోనూ గుర్తింపు పొందిన హోటల్ ఇది. ఈ హోటల్‌కు జీవన్ హోటల్ అనే పేరున్నా అమ్మ హోటల్ గానే అందరికి సుపరిచితం. మండలంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయల్లో పని చేసే ఉద్యోగులు,వచ్చి పోయే ఉన్నతాధికారులు, వివిధ పనుల మీద మండల కేంద్రానికి వచ్చే వారెందరో ఈ హోటల్‌లో భోజనం చేయడాన్ని ఇష్ట పడతారు. ఏడు పదుల వయస్సులోనూ ఈ హోటల్‌ను నడుపుతున్న ఆశమ్మ కొసరి కొసరి ప్రేమగా వడ్డించడమే గాక చౌక ధరకే నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారు. యాభై సంవత్సరాలుగా మండలంలో కొనసాగుతున్న ఏకైక హోటల్ ఇది.


తృప్తిగా భోజనం చేయడమే లక్ష్యం



తన హోటల్‌కు వాచ్చేవారు తృప్తిగా భోజనం చేయలన్నదే తన లక్ష్యం అంటారు జీవన్ హోటల్ నిర్వాహకురాలు ఆశమ్మ.యాభై ఏళ్ళుగా హోటల్ నడుపుతున్నా నాకు ఉపాధితో పాటు అమ్మ అనే పేరు స్థిరపడటం చాలా సంతోషంగా ఉంది. నాకొడుకులు కూడా నాలగే ఈ హోటల్ పేరు నిలబెట్టలన్నాదే నాఆశ.


ప్రజల మన్ననలు పొందుతోంది

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



నవతెలంగాణ-కామారెడ్డి

నవతెలంగాణ పత్రిక ఏర్పడక ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాశక్తి ప్రజల మేలు కోసం ఏర్పడింది. ఈ పత్రిక తెలంగాణ వచ్చిన తర్వాత నవతెలంగాణగా ఆవిర్భవించి తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నవతెలంగాణ యజమాన్యానికి, విలేకరులకు, అందులో పనిచేసే సిబ్బందికి శుభాకాంక్షలు. ఈ పత్రిక అప్పటినుండి ఇప్పటివరకు పేద ప్రజల కష్టాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి ప్రభుత్వ అధికారులకు తెలిసేలా కథనాలను రాస్తోంది. ప్రజల, ప్రభుత్వాల మన్ననలు పొందుతూ వస్తుంది. ఏ ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయమైనా.. కంపెనీ అయినా ఎక్కడ అన్యాయం జరిగినా.. నవతెలంగాణలో కథనం వస్తుందనే నమ్మకం నేటికీ పేద ప్రజల్లో ఉంది. ఆ నమ్మకాన్ని అలాగే కొనసాగించాలి.



అట్టడుగు వర్గాల గొంతుక

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ గొండ



నవతెలంగాణ-పిట్లం

నవతెలంగాణ దినపత్రిక ప్రజల, కార్మికుల పక్షాన నిలబడుతూ.. వారికి అవసరమయ్యే విశ్లేషణాత్మక కథనాలను, వార్తలను రాస్తోంది. నవ తెలంగాణ దినపత్రిక 9వ వార్షికోత్సవ శుభ కాంక్షలు. సమాజంలోని కార్మికులు, యువకు లు, రైతులు, అట్టడుగు వర్గాల ప్రజల గొంతుకగా నవతెలంగాణ పనిచేస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ కార్మికుల పక్షాన నిలబడుతున్న ఏకైక దినపత్రిక నవతెలంగాణ. శ్రామిక అట్టడుగు వర్గాల పేద ప్రజల అనుకూల విధానాలను వార్తల్లో వార్తల రూపంలో ప్రచారంలో అందిస్తున్న పత్రిక నవ తెలంగాణ. రాబోయే రోజులలో పత్రిక మరింత అభివృద్ధి చెందాలి. నవతెలంగాణలో పనిచేస్తున్న సిబ్బందికి, యాజమాన్యానికి తొమ్మిదవ వార్షికోత్సవ శుభాకాంక్షలు.







ప్రజా సమస్యలు వెలికితీయడంలో ముందుంటుంది

- ఐడిసిఎంఎస్ మాజీ చైర్మన్ సాంబార్ మోహన్



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రజా సమస్యలు వెలికితీయడంలో నవ తెలంగాణ ముందు వరుసలో ఉంటుందని, విజయవంతంగా 9వ వార్షికోత్సవం నిర్వహించుకుంటున్న నవతెలంగాణ పత్రిక యజమాన్యానికి, విలేకరులకు, సిబ్బందికి, ప్రత్యేక కృతజ్ఞతలు, శుభాకాంక్షలు. అనుక్షణం ప్రజల పక్షం ఉంటూనే ప్రజలు ఎదుర్కొంటున్న ఏ సమస్య అయినా వెలికి తీసి వాస్తవాలను ఉన్నది ఉన్నట్టుగా ప్రచురించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుంది. తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా దేశంలోని ఆయా రాష్ట్రాల్లో కూడా నవతెలంగాణ పత్రిక ఉండాలి. ఎప్పటికప్పుడు సమస్యలను వార్తలో రూపంలో, ఆర్టికల్స్‌ద్వారా ప్రచురించడం నవతెలంగాణకే సాధ్యం. రాబోవు రోజుల్లో పత్రిక మరింత రాటు రాటు దేలుతూ ఎల్లవేళలా ప్రజాపక్షం ఉంటూనే ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.









నవతెలంగాణ ప్రజల పత్రిక

• ఎస్సై సాయికుమార్



నవతెలంగాణ-భిక్కనూర్

నవతెలంగాణ దినపత్రిక ప్రజల పత్రిక. ప్రజా సమస్యలను గుర్తిస్తూ ప్రజలకు చేరువవుతున్న పత్రిక. పత్రి చదివేందుకు బాగుంటుంది. తెలం గాణ రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నవతెలంగాణ దినపత్రిక యాజమాన్యానికి, పాత్రికేయులకు, సిబ్బందికి శుభాకాంక్షలు.

ప్రజా సమస్యలను గుర్తిస్తుంది

• తహసీల్దార్ శివప్రసాద్



నవతెలంగాణ-భిక్కనూర్

నవతెలంగాణ దినపత్రిక అనుదినం ప్రజా సమస్యల ను గుర్తిస్తుంది. అంతేకాకుండా ఆ సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తుంది. ప్రజలకు అర్థమయ్యే విధంగా వార్తలు రాస్తోంది. ప్రభుత్వ పథకాలు, ప్రజలకు కావలసిన వివరాలు నిత్యం ప్రచురిస్తూ అందరికీ అందుబాటులో ఉంటుంది నవ తెలంగాణ దినపత్రిక. 9 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నవతెలంగాణ దినపత్రిక యాజమాన్యానికి, పాత్రికేయులకు, సిబ్బందికి శుభాకాంక్షలు.

అనుదినం జనస్వరం



• టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి

నవతెలంగాణ-భిక్కనూర్

అనుదినం జన స్వరం నినాదంతో ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే విధంగా కథనాలను ప్రచురిస్తోంది నవతెలంగాణ దినపత్రిక. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను ప్రభుత్వానికి తెలియజేస్తోంది. 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నవతెలంగాణ.. భవిష్యత్తులో మరిన్ని వసంతాలు పూర్తి చేసుకోవాలని కోరుతున్నాను. వార్షికోత్సవం సందర్భంగా నవతెలంగాణ దినపత్రికకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నా.

ప్రతి అక్షరం.. రైతు పక్షం

• చందూర్ పీఏసీఎస్ చైర్మన్ అశోక్ యాదవ్



నవతెలంగాణ-వర్ని

సమాజంలో ప్రజలకు అన్నం పెట్టే అన్నదాతల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి రైతు క్షేమం కోసం ప్రతి అక్షరం రాస్తోంది నవతెలంగాణ దినపత్రిక. రైతులకు, ప్రభుత్వ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వారధిగా పనిచేస్తోంది. ప్రతి అక్షరం రైతుల పక్షాన రాస్తున్న నవతెలంగాణ దినపత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి, విలేకరులకు 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

నవతెలంగాణ నిత్యం చదువుతున్నా

• కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాంధారి హనుమంత్‌రెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి



నవతెలంగాణ దినపత్రిక ఇటు ప్రభుత్వానికి అటు ప్రజలకు వారధిగా పనిచేస్తుంది. అసంఘటిత కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో దినపత్రిక సంస్థ యాజమాన్యం ఎంతో కృషి చేస్తుంది. ప్రస్తుతం తాను నవతెలంగాణ దినపత్రికను నిత్యం చదువుతున్నాను. ప్రజలకు అవసరమయ్యే స్పష్టమైన వార్తలు రాస్తూ ప్రజల మన్ననలు పొందుతోంది. నవతెలంగాణ దినపత్రిక నిర్దిష్టమైన వార్తలు, కథనాలు రాయడంలో ముందంజలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి ఈ పత్రికా స్పష్టంగా వార్తలు రాస్తూ సామాన్య పేద బడుగు బలహీన వర్గాలకు సేవలందిస్తుంది. రైతుల, అసంఘటిత కార్మికుల పక్షాన ఈ పత్రిక నిలబడుతోంది.

నిజాలను నిర్భయంగా రాస్తుంది



• ఎస్సై రాజు

నవతెలంగాణ -పిట్లం

నవతెలంగాణ దినపత్రిక నిజాలను నిర్భయంగా రాయడం అభినందనీయం. నవతెలంగాణ దినపత్రికకు 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు. నవతెలంగాణ దినపత్రిక ఎటువంటి సవాళ్లనైనా ఎదుర్కొంటూ నిజాన్ని నిర్భయంగా రాస్తూ ప్రజల, ఉద్యోగుల, కార్మికుల, కర్షకుల పక్షాన నిలబడి వారి సమస్యలపై విశ్లేషణాత్మక కథనాలు, వార్తలు రాస్తోంది. నవతెలంగాణ తొమ్మిదో వార్షికోత్సవ శుభ సందర్భంలో పత్రిక సిబ్బందికి, యాజమాన్యానికి శుభాకాంక్షలు. పత్రిక మున్ముందు మరింత ముందుకు సాగాలి.

స్పందించి సమస్యలను పరిష్కరించాం

• వర్ని తహసీల్దార్ సాయిలు



నవతెలంగాణ-వర్ని

ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న ఎలాంటి సమస్యలైనా వెలికి తీసి కథనాల రూపంలో ప్రభుత్వానికి తెలియజేస్తోంది నవతెలంగాణ దినపత్రిక. నవతెలంగాణ పత్రికతో నాకున్న సంబంధం మాటల్లో చెప్ప లేను. నవతెలంగాణ పత్రికలో వచ్చిన వార్త లకు మేము స్పందించి సమస్యలను పరిష్క రించినవి చాలానే ఉన్నాయి. ఇలా సమాజం లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చే పత్రికలు ప్రస్తుత తరుణంలో ఎంతో అవసరం. 9వ వార్షికోత్సవం జరుపుకుంటున్న నవతెలంగాణ పత్రికకు నా శుభాకాంక్షలు.

బాధల్ని ప్రచురిస్తూ.. బాధితులకు అండగా..

• కామారెడ్డి పట్టణ ఎస్ఐ రాజారాం

నవతెలంగాణ-కామారెడ్డి



పేద ప్రజల కష్టాలను, బాధలను నవతెలంగాణ తమ కష్టంగా భావిస్తూ వారికి అండగా ఉంటూ వారికి ఉన్న బాధల్ని పత్రికల్లో ప్రచురిస్తోంది. బాధితులకు అండగా నిలుస్తోంది నవతెలంగాణ దినపత్రిక. అందులో పనిచేస్తున్న విలేకరులు సైతం నియమ నిబంధనలతో పని చేస్తూ సమాజంలో, పత్రికలో మంచి పేరు తెచ్చుకుంటున్నారు. ఇది ఇలాగే కొనసాగాలి. జాతీయ, అంతర్జాతీయ వార్తలు, వ్యాపారం, క్రీడలు, కలలు తదితర రంగాల వార్తలను అందిస్తున్న నవతెలంగాణ పత్రికకు 9వ వార్షిక శుభాకాంక్షలు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధి

• తహసీల్దార్ వేణుగోపాల్



నవతెలంగాణ-పిట్లం

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నవతెలంగాణ దినపత్రిక పనిచేస్తోంది. నవతెలంగాణ దినపత్రిక 9వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న శుభ సందర్భంలో నవతెలంగాణ దినపత్రిక యాజమాన్యానికి.. పత్రికలో పనిచేస్తున్న ప్రతి ఒక్క సిబ్బందికి, పాత్రికేయులకు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై నిర్భయంగా వెలికి తీసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో నవతెలంగాణ పత్రిక ముందుంది. అటు ప్రభుత్వ పలు సంక్షేమాలను ప్రజల దృష్టికి అందిస్తుంది. గతంలో ప్రజాశక్తిగా వెలుగొందిన పత్రిక మళ్లీ నవ తెలంగాణ రూపంలో ప్రజల, ప్రభుత్వ ఆదరాభిమానాలతో వెలుగొందుతోంది.

మానవీయ విలువలు పెంచాలి

• కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నవతెలంగాణ దినపత్రిక 9 సంవత్సరాలుగా అనేక సామాజిక, మౌలిక సమస్యల పరిష్కారం దిశగా అవిశ్రాంతంగా పనిచేయడం అభినందనీయం. ఈ నేపథ్యంలో 9వ వార్షికోత్సవం విజయవంతంగా పూర్తి చేసుకుని పదో వార్షికోత్సవంలో అడుగు పెడుతున్న సందర్భంగా నాగిరెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ పక్షాన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ప్రధానంగా నాగిరెడ్డిపేట్ మండల అభివృద్ధిలో భాగంగా పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కరింపచేయడంలో నవతెలంగాణ తమ వంతు పాత్ర పోషించడం అభినందనీయం. మానవీయ విలువలు పెంచడం కోసం ఈ పత్రిక మరింత కృషి చేస్తుందని నా విశ్వాసం. వార్షికోత్సవ సందర్భంగా యాజమాన్యానికి, విలేకరులకు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు శుభాకాంక్షలు.

కార్మికుల సమస్యలపై పోరాడే పత్రిక



• ఎంపీడీవో వెంకటేష్ జాదవ్

నవతెలంగాణ-రెంజల్

కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ వారి సమస్యలను పరిష్కరించే దిశలో ముందుకు సాగుతున్న ఏకైక పత్రిక నవతెలంగాణ. ప్రజలు, కార్మికులు, కర్షకుల సమస్యలపై నిత్యం కథనాలు రాస్తూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తుంది. అధికారులు సైతం నవతెలంగాణ పత్రికను చదువుతూ.. సమస్యలపై స్పందిస్తూ పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు. నవతెలంగాణ 9వ వార్షికోత్సవం జరుపుకుంటున్న నేపథ్యంలో నవతెలంగాణ సిబ్బందికి, పాత్రికేయులకు, యాజమాన్యానికి శుభాకాంక్షలు. ఇదే ఒరవడి కొనసాగించి జర్నలిజం విలువలు పెంచే విధంగా తమ వంతు పాత్ర పోషిస్తూ ఉండాలని ఆకాంక్షించారు.

ప్రజల పక్షాన పనిచేసే పత్రిక నవతెలంగాణ

• సూపరింటెండెంట్ హెచ్.శ్రీనివాస్



నవతెలంగాణ-రెంజల్

ఎన్ని అవాంతరాలు ఎదురైనా ప్రజల పక్షాన పనిచేసే పత్రిక నవతెలంగాణ ఒక్కటే. ఈ దినపత్రిక ప్రజా సమస్యలను నిరంతరం వెలికితీసి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తోంది. సమాజంలో నేడు పత్రికలు వ్యాపారంగా మారిన ఈ రోజుల్లో ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలపై పోరాటం చేస్తున్న ఏకైక పత్రిక నవతెలంగాణ. తొమ్మిదవ వార్షికోత్సవ సందర్భంగా నవతెలంగాణ సిబ్బందికి శుభాకాంక్షలు.

పోరాటాల కోసమే పుట్టిన పత్రిక

● తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు



నవతెలంగాణ-కంఠేశ్వర్

స్వతంత్ర పోరాట సమయంలో పోరాటాల కోసమే పుట్టిన పత్రిక ప్రజాశక్తి. ఆంధ్ర ప్రదేశ్-తెలంగాణ విడిపోయిన తర్వాత అది నవ తెలంగాణగా రూపాంతరం చెందింది తప్ప ప్రమాణాలలో ఎలాంటి మార్పులు లేవు. నిజాన్ని నిర్భయంగా చెప్పగలిగే శక్తి ఉన్న నిజమైన భారత రాజ్యాంగ నాలుగవ పిల్లర్ నవతెలంగాణ పత్రిక. హంగులు, రంగులు, పొంగులు కలిగి ఉన్న ఈ రంగుల లోకంలో గల పత్రికలతో నవ తెలంగాణను పోల్చవద్దు. ఎందుకంటే ఇది నిజమే చెబుతుంది అది కూడా నిర్భయంగా చెబుతుంది. రాజకీయాలు, ప్రజా ఉద్యమాలు, అలాగే సామాజిక న్యాయం కోసం ప్రతి అక్షరం ప్రజల కోసమే ముద్రిస్తున్న లాభాపేక్ష కోరుకోని పత్రిక. నేటికి 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు నవతెలంగాణ పత్రికను, సిబ్బందిని ప్రశంసిస్తున్నాను. ఈ పత్రికని ప్రజలంతా ఆదరించాలి.

సామాన్యుడి ప్రజాగొంతుక నవ తెలంగాణ

● సబ్ రిజిస్ట్రర్ మహేందర్ రెడ్డి


నవతెలంగాణ-ఆర్మూర్



నిజాలను నిర్భయంగా రాస్తూ ప్రతినిత్యం ప్రజలను విజ్ఞానం వైపు చైతన్యం వైపు నడిపిస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ఎన్నో సమస్యలను పరిష్కరిస్తున్న పత్రిక నవ తెలంగాణ. ఉద్యమాల కోసం పుట్టిన పత్రిక ప్రజా గొంతుక, కొత్త కొత్త ఆలోచనలతో ప్రజా సమస్యలే ధ్యేయంగా నవ తెలంగాణ ముందు వరసలో ఉంటూ విజయవంతంగా 9వ వార్షికోత్సవం జరుపుకుంటున్న పత్రిక యాజమాన్యానికి విలేకరులకు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నది ఉన్నట్లుగా వివరిస్తూ సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకొని వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న పత్రిక.

ప్రజలకు అన్ని రంగాల్లో అవగాహన కల్పిస్తున్న పత్రిక

● ఐశ్వంత్-ఆయుష్ మెడికల్ ఆఫీసర్ కిసాన్ నగర్



నవతెలంగాణ-బాల్కొండ

ప్రజా సమస్యలకు ప్రజల గొంతుగా నిలబడుతూ పరిష్కారానికి కథనాలను రాస్తూ ముందుకు వెళ్తున్న నవ తెలంగాణ దినపత్రిక తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా సిబ్బందికి శుభాకాంక్షలు. మరెన్నో ఉన్నత శిఖరాలను చేరుకొని మంచి మంచి కథనాలతో ఇంకా ప్రజలకు దగ్గర అవ్వాలి. ప్రజలకు అన్ని రంగాల్లో అవగాహన కల్పిస్తున్న దినపత్రిక. పదవ వార్షికోత్సవంలో అడుగుపెడుతున్న వేళ ప్రత్యేక శుభాకాంక్షలు.

ప్రజాస్వామ్య పునాదిని పటిష్టం చేయడంలో నవతెలంగాణది మహోజ్వలమైన పాత్ర

● ఎంపీడీవో నాగనాథ్



నవతెలంగాణ-నవీపేట్

ప్రజల్లో చైతన్యలేమిని తట్టి లేపి ప్రజాస్వామ్య భారతదేశ పునాదిని మరింత పటిష్టం చేయడంలో నవ తెలంగాణ దినపత్రిక మహోజ్వలమైన పాత్ర పోషిస్తుంది. 9 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకొని దశాబ్ద కాలంలోకి అడుగుతున్న సందర్భంగా సమాజంలో మరింత ముందుకు పోవాలని మనసారా కోరుకుంటున్నాను.

విద్యార్థుల సమస్యలను ప్రభుత్వానికి చేరవేయడంలో ముందుంటుంది

● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్



నవతెలంగాణ-కంఠేశ్వర్

విద్యార్థుల సమస్యలే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ పునర్నిర్మాణం కోసం పనిచేస్తు తొమ్మిదవ వసంతాన్ని పూర్తిచేసుకుని పదవ వసంతానికి చేరిన నవ తెలంగాణ పత్రికకు, విలేకరులకు, ప్రతి ఒక్కరికి వార్షికోత్సవ శుభాకాంక్షలు. విద్యారంగంలో జరిగే అవకతవకల పై ముక్కు సూటిగా వార్తలు రాసే పత్రికగా నవ తెలంగాణ పేరొందింది. విద్యారంగంలో జరిగే ప్రతి మార్పును పాఠకులకు అర్థమయ్యేటట్టు వార్తలు రాస్తున్న నవ తెలంగాణకు కృతజ్ఞతలు.

అన్యాయాన్ని ఎదిరించే ఉద్యమ పత్రిక

● మాజీ ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి

నవతెలంగాణ -ఏర్గట్ల



నవతెలంగాణ ప్రజాపత్రిక, ఉద్యమ పత్రిక, తాడిత, పీడిత ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసే పత్రిక. తన కలంతో ఎన్నో పోరాటాలను చేసి, అక్రమార్కుల గుండెల్లో గుబులు పుట్టించింది, తప్పుచేస్తే అధికార పక్షం, ప్రతిపక్షం అని తేడా లేకుండా సమన్యాయం పాటిస్తుంది. సమస్యలను అందరికి అర్థమయ్యేలా చక్కగా వివరిస్తూ... ముందుకు సాగుతుంది. ఈ ప్రజా పత్రిక నవతెలంగాణకు బీఆర్ఎస్ పార్టీ తరపున,మండల ప్రజల తరపున శుభాకాంక్షలు.

ప్రజల నాడిని పసిగడుతుంది

● నిజామాబాద్ రూరల్ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి, శ్రీపతి శేఖర్



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

అన్ని పత్రికల కంటే ముందుగా స్పందిస్తూ సమాచారాన్ని అధికారులకు రాజకీయ నాయకులకు అందించే విధంగా పనిచేస్తుంది. కార్మికులు, చిన్న స్థాయి ఉద్యోగులు, ప్రజల సమస్యలను వెలికి తీసేందుకు ప్రయత్నం చేస్తుంది. ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తుంది.

కార్మికుల పక్షాన గళం వినిపించే పత్రిక నవ తెలంగాణ



● నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కార్మికుల పక్షాన గళం వినిపించే పత్రిక నవ తెలంగాణ దినపత్రిక. ఒకే వర్గానికే పరిమితమైన వేళ కార్మికుల పక్షాన ప్రశ్నించే గొంతై నిలిచింది. అనేక ఆటంకాలను ధైర్యంగా ఎదుర్కొని సిబ్బందే యాజమాన్యంగా భావించే పత్రిక. 9 సంవత్స రాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నవతెలంగాణ కుటుంబ సభ్యులకు హార్థిక శుభాకాంక్షలు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్లో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. ప్రజలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటిని రోజు వారీగా శుభ్రం చేసుకోవాలి, ఇంట్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. ఒకవేళ ఉంటే వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటే ఎలాంటి రోగాలు దరిచేరవు.

సమాజ శ్రేయస్సే లక్ష్యం



● సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బట్టి దత్తాద్రి గౌడ్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ప్రతి ఒక్కరిని ఆదరిస్తూ, అందరిని కలుపుకు పోతు సమాజ శ్రేయస్సే లక్ష్యంగా అలుపెరుగని కృషి నవతెలంగాణకే సాధ్యం. ప్రతి సామాన్యుడి సమస్యను వెలికి తీసే పత్రిక నవ తెలంగాణ. ప్రతి ఒక్కరిని గుర్తించే పత్రిక. పేద, ధనిక వర్గాలతో పాటు కార్మికులకు అండగా నిలుస్తూ ముందుకు సాగుతోంది.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధి

● ఎంఆర్వో అనురోద్ నాయక్

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్




ప్రభుత్వ అధికారులకు, ప్రజలకు, ప్రభుత్వానికి వారధి పత్రికలు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు అవగాహన కల్పించడంలో తెలియజేయడంలో పత్రికల పాత్ర ప్రశంసనీయం. ఈ పత్రికలో పనిచేసే విలేకరుల సేవలు కూడా అమోఘమైనవి. పత్రికా విలేకరుల లేకపోతే సమాజం అంధకారంలో ఉన్నట్లుగా ఉంటుంది. ఏ పార్టీకి కొమ్ముకాయకుండా ప్రజల పక్షాన నిలబడే పత్రిక అంటే నవ తెలంగాణ పత్రిక. దీంట్లో పనిచేసే విలేకరులు కూడా నిజాయితీగా పని చేస్తారు. స్వలాభం కోసం కాకుండా ప్రజల కోసం పనిచేసే పత్రిక. తొమ్మిదవ వార్షికోత్సవ జరుపుకుంటున్న సందర్భంగ పత్రికలో పని చేసే సిబ్బందికి అందరికి పేరు పేరునా ప్రత్యేక ధన్యవాదాలు.

ప్రజల పక్షాన నిలిచే పత్రిక నవతెలంగాణ

● మనోరమ హాస్పిటల్ న్యూరో సర్జన్ కట్ట నరసింహా

నవతెలంగాణ-కంఠేశ్వర్



ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజల పక్షాన నిలిచిన పత్రిక నవ తెలంగాణ పత్రిక. ప్రగతి వైపు మాత్రమే దృష్టి పెట్టిన పత్రిక అంటే అది నవ తెలంగాణ. ఉద్యమాలకు పదివేల సైన్యం సమకూరినంత బలం ఉన్న పత్రిక. నవతెలంగాణ పత్రిక ఇంకా లోతైన విశ్లేషణలతో ముందుకు వెళ్లాలి. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నవతెలంగాణ తన పాత్రను మరింతగా ముందుకు తీసుకెళ్లాలి. తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా నవతెలంగాణ ప్రయాణం, బాధ్యతాయుతంగా కొనసాగాలని కోరుకుంటున్నా. 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పత్రిక యాజమాన్యానికి సిబ్బందికి, జర్నలిస్టులకు శుభాకాంక్షలు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి



● ఎంపీడీవో సంతోష్ కుమార్

నవతెలంగాణ-భీంగల్

పర్యావరణ పరిరక్షణ కు ప్రతి ఒక్కరు పాటుపడాలని ఎంపీడీవో సంతోష్ కుమార్ తెలిపారు. నవ తెలంగాణ దినపత్రిక తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా పత్రికకు, యాజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ నిరంతరం ప్రజా సమస్యలను తెలియజేస్తూ ప్రజా గొంతుకగా నవతెలంగాణ ముందుకు సాగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తనవంతుగా రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి. భీంగల్ మండలంలో --1.20-- మొక్కల లక్ష్యంతో చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ప్రతి వ్యక్తి వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతోపాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలి.

c m y k

అధికారం, సంపద కేంద్రీకృతం కారాదు?

మన దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి ఎనిమిది దశాబ్దాలకు చేరువవుతున్నాం. ప్రజాస్వామ్య పాలనలో నేడు అభివృద్ధి జరిగిందనే మాట ఏ మేరకు నిజమో.. ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదనేది కూడా అంతే వాస్తవం. మన తరువాత స్వాతంత్య్రం తెచ్చుకున్న చిన్న దేశాలు అభివృద్ధిలో మనకంటే వేగంగా దూసుకు పోతున్నాయి. మన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రధాన అంగాలైన 1.చట్టసభలు, 2.కార్య నిర్వాహక వర్గం, 3.న్యాయశాఖ, 4.మీడియా స్వేచ్ఛ. ఇవి నిరంతరం ప్రజా శ్రేయస్సునే కాంక్షించాల్సి ఉంది. అంతే కాదు రాజ్యాంగ బద్ధమైన పాలన అందించాల్సి ఉంది. ఆ మేరకు జరుగుతుందా అంటే? లేదు. మన దేశంలో అధికారం చేపట్టిన ప్రభుత్వాలు చేసే వ్యయంపై విశ్వసనీయత చాలా తక్కువగా ఉంటుంది. పౌరుల అభివృద్ధి(సేవ)లో భాగంగా అమలు చేసే పథకాలు క్షేత్రస్థాయిలో నిజమైన లబ్ధిదారులకు చేరని కారణంగా జాతి సంపద పక్కదారి పట్టడంతో ఇటు లబ్ధిదారులకు, అటు జాతి సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. దేశ సంపద కొద్ది మంది సంపన్నుల వద్ద కేంద్రీకృతమౌతుంది. మన దేశ ఆర్థిక కార్యకలాపాలలో, పరిపాలనలో పారదర్శకత, మానవీయత లేమి, హామీల అమలులో వైఫల్యాలు, విద్య, వైద్య రంగాలను



నిర్లక్ష్యం చేయడం, అవినీతి, బంధుప్రీతి పెరిగిపోతోంది.

భారతదేశం ఒకవైపు వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్తున్నా, ఇంకోవైపు నిరుద్యోగం, అవినీతి, ఆర్థిక అసమానతల సమస్య తీవ్రంగా వెంటాడుతోంది. ఆర్థికంగా అభివృద్ధి చెందిన జనాభా మెరుగైన జీవనం గడుపుతున్నారు.. మరో 50 శాతం ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణాల్లోని స్లమ్ ఏరియాల్లో నివసించే వారికి ప్రభుత్వాల సాయం అవసరం అవుతుంది. ఈ కారణం చూపుతూ దేశ రాజకీయాలు సంక్షేమ కార్యక్రమాల చుట్టూ తిరుగుతున్నాయి. ఏ పార్టీ ఎన్ని ఎక్కువ సంక్షేమ పథకాలు ప్రకటిస్తుందా! అని చూసే పరిస్థితి నెలకొని ఉంది. ఇది ఓటు బ్యాంకుగా మారడమే దురదృష్టకరం. ఇది రాజకీయ పార్టీలకు ఆయుధంగా మారింది. సరళీకరణ తర్వాత పెట్టుబడి సామర్థ్యం, విద్య ఉన్నవారిలో అభివృద్ధి పెరిగింది. అయితే వృద్ధిలో భాగస్వాములు కాలేకపోతున్న వారికి సరైన జీవితం ఇవ్వాలి. ఇది వారి పురోగతికి దేశ పురోగతికి ఉపయోగపడుతుంది. ఇది జరగాలంటే మంచి విద్య, ఆరోగ్యం లాంటి ప్రాథమిక సేవలు సక్రమంగా అందేలా చూడవలసి ఉంది. మరోవైపు సంక్షేమ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం నాణ్యమైన ఉద్యోగాలు కల్పించలేకపోవడం జరుగుతుంది. విద్య, వైద్యం, పౌష్టికాహార లోపం, ప్రజా భద్రత, న్యాయం, సామాజిక రక్షణ, ఉద్యోగుల నైపుణ్యం లాంటి అనేక సమస్యలు ఎదుర్కొంటుంది. మన దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ప్రధానమైన విద్య, వైద్యం, ప్రజా భద్రత సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. విద్యకు ఏటా జీడీపీలో సుమారు మూడు శాతం వరకు ఖర్చు చేస్తున్నాయి. ప్రథమ్ సర్వే లాంటివి రెండు దశాబ్దాలుగా చెప్తున్నది ఏమిటంటే? గ్రామీణ ప్రాంతాల్లో ఐదో తరగతి పూర్తి చేసిన వారిలో సగం మంది పిల్లలు రెండవ తరగతి పాఠ్యపుస్తకాలు చదవలేక పోతున్నారు. దీన్ని అధిగమించేలా ప్రాథమిక విద్య నుండి విశ్వవిద్యాలయ, వృత్తి విద్యల వరకు అన్ని స్థాయిల్లో నాణ్యత, నైపుణ్యాలను, సృజనాత్మకతను పెంచాల్సి ఉంది. ఉపాధ్యాయుల జీతాలు పెంచడం వల్ల విద్యార్థుల్లో లెర్నింగ్ స్కిల్ మెరుగుపడదు. టీచర్ల పనితీరు ఆధారంగా మూడు నుంచి ఐదు శాతం అదనపు చెల్లింపుల వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. ఎలాంటి షరతులు లేకుండా జీతాలు పెంచడం కంటే! ఇలా చేయడం చాలా మంచిది. అలాగే బాల్యం నుండే పౌష్టికాహార లోపంతో ఉండే పిల్లల సంఖ్య మరే దేశంతో పోల్చినా భారతదేశంలో ఎక్కువగానే ఉంది. మరోపక్క ప్రభుత్వ ఆసుపత్రిలో తగినంత మంది సిబ్బంది లేరు. సిబ్బంది తరుచు గైర్హాజరుతో 70 శాతం ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారి అత్తెసరు సంపద ఆవిరైపోతుంది. నాణ్యమైన సౌకర్యాలతో విద్య, వైద్యం ప్రభుత్వాలే ఉచితంగా అందరికీ అందించాలి. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే ఆర్థిక పురోభివృద్ధిలో పాలు పంచుకుంటారు. ప్రభుత్వ నిర్వహణ పరంగా పారదర్శకత, విశ్వసనీయత ప్రజా ప్రయోజనాలే సత్య నిష్టగా అన్ని స్థాయిలోనూ మార్పు జరగాలి. రాష్ట్రాలు, కేంద్రం ఈ విషయంలో ఉమ్మడి నిర్ణయాలతో ముందుకు సాగాలి. నాటి స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాల స్ఫూర్తితో ప్రజాస్వామ్య విలువలను పునరుద్ధరిస్తూ ప్రజాశ్రేయస్సే ధ్యేయంగా పాలన సాగాలి. వారికి ప్రజలే రక్షణ కవచంగా నిలుస్తారు.

– మేకిరి దామోదర్, సోషల్ ఎనలిస్ట్,
ఫోన్:9573666650

ప్రగతిశీల విలువలకు చిరునామా

- బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రాల సిద్దయ్య

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



తెలంగాణ రాష్ట్రంలో ప్రగతిశీల శక్తుల ఆలోచనల ప్రతిబింబమే ఈ నవ తెలంగాణ దినపత్రిక. శాస్త్ర సాంకేతిక అభివృద్ధిని మెరుగు పరచడం కోసం మూఢ అంధ విశ్వాశాలను పాదరేస్తూ సమా జంలో చైతన్యవంతమైన ప్రగతిశీలమైన ఉన్నత విలువలను రక్షించడం కోసం పత్రిక చేస్తున్న కృషి అభినందనీయం. పత్రిక అందిస్తున్న ఎడిటోరియల్స్ వివిధ సామాజిక ఆర్థిక రాజకీయ రంగంలో జరుగుతున్న మార్పులపై వస్తున్న వ్యాసాలు సమాజాన్ని చైతన్య పరుస్తున్నదనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రజల పక్షపాతిగా ఉంటూ ప్రభుత్వంలోని వైఫల్యాలను వెలికి తీసి సమసమాజం కోసం మరింత దర్శానికంగా ముందుకు పోవాలని కోరుకుంటూ తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా నవతెలంగాణ యాజమాన్యానికి, విలేకరులకు, సిబ్బందికి శుభాకాంక్షలు.

బాధితులకు భరోసా

- నిజాంసాగర్ ఎస్సై కే సుధాకర్

నవతెలంగాణ-నిజాంసాగర్



పేద ప్రజల సమస్యలను తీర్చడంలో నవతెలంగాణ నిత్యం ముందుంటుంది. ఇలాంటి మరెన్నో సేవలు ఈ పత్రిక అందించాలి. రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా సైబర్ నేరగాళ్ల వల్ల మోసపోతే వెంటనే 1930కి సమాచారం ఇవ్వాలి. నవతెలంగాణ 9వ వార్షికోత్సవం జరుపుకుంటున్న నేపథ్యంలో సిబ్బందికి, విలేకరులకు, పాఠకులకు తొమ్మిదవ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

సవాళ్లను అధిగమిస్తూ..

- కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ మండలాధ్యక్షులు ఇమామ్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



నవతెలంగాణ పత్రిక ప్రజాపత్రిక. ఎటువంటి సవాళ్లనైనా ఎదుర్కొంటూ నిజాన్ని నిర్భయంగా రాస్తుంది. నిరంతరం కార్మిక, కర్షక, ఉద్యోగుల పక్షాన నిలబడి పోరాటం చేస్తుంది. తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా పత్రికకు, యాజమాన్యానికి, విలేకరులకు నాగిరెడ్డిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ తరపున శుభాకాంక్షలు.

నవతెలంగాణలో ఉన్నది ఉన్నట్టు

- మాజీ జెడ్పిటిసి ఉమ్మన్నగారి మనోహర్‌రెడ్డి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నవతెలంగాణ ముందు వరుసలో ఉంది. విజయవంతంగా 9వ వార్షికోత్సవం జరుపుకుంటున్న నవతెలంగాణ పత్రిక యాజమాన్యానికి, విలేకరులకు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు. అనుక్షణం ప్రజల పక్షం ఉంటూనే ప్రజలు ఎదుర్కొంటున్న ఏ సమస్య అయినా వెలికితీసి వాస్తవాలను ఉన్నది ఉన్నట్లుగా వివరిస్తూ సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకొని వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంది. నిరుపేద, కులం, మతం, జాతి, భేదం లేకుండా అన్ని పక్షాల ప్రజలకు మద్దతుగా నిలుస్తున్నది. ఇలాంటి వార్షికోత్సవాలు ఇంకో ఎన్నో జరుపుకోవాలని కోరుకుంటూ బిఆర్ఎస్ పార్టీ తరపున నా శుభాకాంక్షలు.

ప్రభుత్వానికి ప్రజలకు వారధి

- ఎస్ఐ ఈ.సాయన్న

నవతెలంగాణ-రెంజల్



నవతెలంగాణ దినపత్రిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలికి తీసి అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తుంది. నవతెలంగాణ దినపత్రికలో ప్రతిరోజు మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం నెలకొన్న సమస్యలను సేకరించి ప్రచురించడమే కాకుండా సమస్యల పరిష్కారం అయ్యేంతవరకు దానిపై దృష్టిని సారిస్తూ వార్తలు, కథనాలను అందిస్తోంది. 9వ వార్షికోత్సవం సందర్భంగా నవతెలంగాణ సిబ్బందికి వార్షికోత్సవ శుభాకాంక్షలు.

పీడిత వర్గాల ఆశాజ్యోతి

- ఎంపీవో మారుతి

నవతెలంగాణ-వర్ని



నవతెలంగాణ దినపత్రిక కార్మిక, కర్షకుల పక్షాన నిలబడుతుంది. పీడిత వర్గాల ఆశాజ్యోతి నవతెలంగాణ దినపత్రిక. ప్రజల సమస్యలను ప్రభుత్వాలకు చేర్చి ప్రజలకు అండగా ఉంటుంది. ప్రతి దినం జనంస్వరంగా పనిచేస్తోంది. పత్రిక 9వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా నవతెలంగాణలో పనిచేసే ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు.

ప్రజలకు అండగా నిలబడిన నవతెలంగాణ

- ఇంచార్జి తహసీల్దార్ శ్రావణ్ కుమార్

నవతెలంగాణ-రెంజల్



రాజకీయ పార్టీలకతీతంగా ప్రజా సమస్యలపై స్పందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న ఏకైక పత్రిక నవతెలంగాణ. నేటి సమాజంలో లాభార్జనే ముఖ్య ఉద్దేశ్యంతో పలు పత్రికలు అగ్రవర్ణాలకు కొమ్ముకాస్తున్న నేటి రోజుల్లో ప్రజల పక్షాన నిలబడుతూ.. వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న పత్రిక నవ తెలంగాణ. ఈ సందర్భంగా నవతెలంగాణలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

నిజాన్ని నిర్భయంగా రాసే పత్రిక

- ఐరేని నర్సయ్య మాజీ సర్పంచ్ దోమకొండ

నవతెలంగాణ-దోమకొండ



నిజాన్ని నిర్భయంగా రాసి ప్రజలకు అండగా నిలుస్తున్న పత్రిక నవతెలంగాణ పత్రిక. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ముందుండే పత్రిక నవతెలంగాణ పత్రిక. 9వ వార్షికోత్సవం సందర్భంగా పత్రికకు, యాజమాన్యానికి ప్రత్యేక శుభాకాంక్షలు.

c m y k

అడవుల సంరక్షణ అందరి బాధ్యత


- అటవీ రేంజ్ అధికారి రవీందర్ నాయక్
- 29హెక్టార్లలో ప్లాంటేషన్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

అడవుల సంరక్షించాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉంది. అడవుల పెంపకంపైనే మానవ మనుగడ ఆధారపడి ఉంది. అడ్డగోలుగా అడవులను నరికితే భవిష్యత్తు తరాలకు మనమే శత్రువులం. మన భవిష్యత్తు తరాలు బాగుండాలన్న, పర్యవరణాన్ని కాపాడాలన్న మన చేతుల్లో ఉంటుంది. ఇందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించి మొక్కలు నాటి సంరక్షించాలని కమ్మర్‌పల్లి అటవీ రేంజ్ అధికారి రవీందర్ నాయక్ అన్నారు.స్వాతంత్ర్య దినోత్సవ వేళ నవతెలంగాణతో ఆయన ముచ్చటించారు.



ఎఫ్ఆర్ఓ రవీందర్‌నాయక్



రేంజ్ పరిధిలో ఏర్పాటుచేసిన బ్లాక్‌ఫారెస్ట్

కమ్మర్ పల్లి అటవీ రేంజ్ పరిధి ఎంత?

కమ్మర్ పల్లి అటవీ రేంజ్ పరిధిలో కమ్మర్ పల్లి, మోర్తాడ్, భీంగల్, వేల్పూర్, ఏర్గట్ల మండలాలు ఉన్నాయి.ఈ మండలాల పరిధిలో అటవీ విస్తీర్ణం మొత్తం 14504.71హెక్టార్లు, 84.90కిలో మీటర్లు.

ఎన్ని సెక్షన్లు, ఎన్ని బీట్‌లు ఉన్నాయి?

కమ్మర్‌పల్లి అటవీ రేంజ్ పరిధిలో 5 సెక్షన్‌లు, 18 బీట్‌లు ఉన్నాయి. వీటిలో బషీరాబాద్, కోనాపూర్, మోర్తాడ్, భీంగల్, భీంనగర్ సెక్షన్‌లు ఉన్నాయి. బషీరాబాద్ సెక్షన్ పరిధిలో కమ్మర్‌పల్లి, బషీరాబాద్, కోన సముందర్ బీట్‌లు ఉన్నాయి. కోనాపూర్ సెక్షన్ పరిధిలో కోనాపూర్, ఇనాయత్ నగర్, అమీర్‌నగర్, నర్సాపూర్ బీట్లు, మోర్తాడ్ సెక్షన్‌లో మోర్తాడ్, భీంగల్ సెక్షన్‌లో భీంగల్, మెండోర, పల్లికొండ నార్త్, పల్లికొండ సౌత్, కారెపల్లి నార్త్, కారెపల్లి సౌత్, భీంనగర్ సెక్షన్‌లో భీంనగర్ నార్త్, భీంనగర్ సౌత్, తాళ్లపల్లి నార్త్, తాళ్లపల్లి సౌత్ బీట్లు ఉన్నాయి. వీటి పరిధిలో సిసిటి డేన్ 71.80కిలో మీటర్లు, బౌండరీ పిల్లర్లు 1593, గచ్చకాయ ప్లాంటేషన్ 71.80కిలో మీటర్లు, ఎస్ఎంసీ వర్క్‌లో భాగంగా ఎస్‌సిటిలు 300, ఆర్ఎఫ్‌డిలు 539 ఉన్నాయి.

వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలకు సంబంధించి పర్క్యులేషన్ ట్యాంకులు 82, చెక్ డ్యాంలు 12, ససార్ పీట్స్ 55, సోలార్ పంపులు 3 నిర్మించాం. అగ్నిప్రమాదాలు జరగకుండా 233.6 కిలో మీటర్ల మేర ట్రెంచ్ నిర్మాణం చేసినట్లు వివరించారు.



చెక్‌డ్యాం

ఏరకమైన ప్లాంటేషన్‌లు ఏర్పాటు చేస్తున్నారు?

రేంజ్ అధికారి : రేంజ్ పరిధిలో బ్లాక్ ప్లాంటేషన్ 585 హెక్టార్లలో, గ్యాప్ ప్లాంటేషన్ 60 హెక్టార్లలో, ఔషధ మొక్కల ప్లాంటేషన్ 145 హెక్టార్లలో, పండ్ల మొక్కల ప్లాంటేషన్ 10హెక్టార్లలో, బాంబో ప్లాంటేషన్ 67.50 కిలో మీటర్ల పరిధిలో ఏర్పాటు చేశాం.



అడవి జంతువులకోసం ఏర్పాటుచేసిన సాసర్‌పీట్

2024-25 ప్లాంటేషన్ లక్ష్యం ఏమిటీ?

రేంజ్ అధికారి : అటవీ రేంజ్ పరిధిలో 2024-25 సంవత్సరంలో 29హెక్టార్లలో ప్లాంటేషన్ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. భీంగల్ సెక్షాన్ పరిదిలోని మోర్తాడ్ మండలం సుంకెట్ అటవీ పరిధిలోని కంపార్ట్మెంట్ నంబర్-99లో 10 హెక్టార్లు, సైట్-1 క్రింద దేవక్కపేట్-తాటిపల్లి రోడ్డులో 4.5హెక్టార్లు, సైట్-2 కింద సిరికొండ-వేములవాడ రోడ్డులో 4.5 హెక్టార్లు, బషీరాబాద్ సెక్షాన్‌లోని కోన సముందర్ బీట్ పరిధిలోని కుప్‌గల్ అటవీ పరిధిలోని కంపార్ట్మెంట్ నంబర్-96లో 10 హెక్టార్లలో ప్లాంటేషన్ ఏర్పాటు చేస్తాం.

అటవీ రేంజ్ పరిధిలో ఎంత మంది సిబ్బంది ఉన్నారు?

రేంజ్ అధికారి : నాతో పాటు ముగ్గురు డిప్యూటి రేంజ్ అధికారులు, ఇద్దరు ఫారెస్ట్ సెక్షన్ అధికారులు, 13మంది బీట్ అధికారులు, సీనియర్ అసిస్టెంట్, అఫిస్ సబార్డినేట్, కంప్యూటర్ ఆపరేటర్ ఒకరు చొప్పున ఉన్నారు.

నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్



నవతెలంగాణ-ఆర్మూర్

డివిజన్ పరిధిలోని నేరాల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్ తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలికి తీసి అధికారులకు ,ప్రభుత్వాల దృష్టికి తీసుకు వెళ్తున్న పత్రిక నవ తెలంగాణ అని వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

నేరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లా సిపి కల్మేశ్వర్, ఏసీపీ బస్వారెడ్డి ఆదేశానుసారం నేరాల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం .పాత నేరస్తులపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతున్నాం. తనిఖీలు ముమ్మరంచేసి పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచుతున్నాం. ఇందుకు గాను రద్దీ ప్రాంతాల్లో మఫ్టీల్లో మా సిబ్బందితో నిఘా ఉంచుతున్నాం.

నైట్ పెట్రోలింగ్ ఎలా జరుగుతుంది.?

నైట్ పెట్రోలింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. రాత్రి వేళల్లో సిబ్బంది పెట్రోలింగ్ డ్యూటీలో ఉంటున్నారు. అవసరమైతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నైట్ డ్యూటీల్లో సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు ఇస్తున్నాం.

సామాజిక మాధ్యమాల వినియోగంపై ప్రజలకు మీరిచ్చే సూచనలు ?

ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న వాట్సాప్, ఫేస్ బుక్, వైరల్ వీడియోలను నమ్మవద్దు. పేకాట, మట్కా, గుట్కా వంటి వాటిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలి. నేరాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలి. షాపింగ్ మాల్స్, అపార్ట్‌మెంట్లు, నూతన గృహాలు నిర్మించుకునే వారు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం.

సైబర్ నేరాలపై ప్రజలకు మీరిచ్చే సూచనలు?

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. గుర్తుతెలియని ఉత్తరాలు మెసేజ్‌లు వచ్చిన స్పందించవద్దు. గుర్తుతెలియని వ్యక్తుల మాయ మాటలు నమ్మవద్దు. మన బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పోలీస్ కళాబృందాలతో అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వర్తిస్తున్నాం.

వాహనదారుల నిబంధనలపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఉన్నతాధికారుల ఆదేశానుసారం నేటి నుంచి వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి. లేకుంటే జరిమానాలు తప్పవు. రోడ్డు ప్రమాదంలో విలువైన ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబంపై ఆధారపడ్డ భార్య, పిల్లల జీవితాలు ప్రశ్నార్థకం అవుతాయి. మద్యం సేవించి వాహనాలు నడపవద్దు.

నేటి యువతకు మీరిచ్చే సలహాలు?

చిన్ననాటి నుంచి కష్టపడి చదువుకుంటే ఉన్నత స్థాయికి ఎదగవచ్చు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు.

నిరుపేదలకు మంచి వైద్యం అందించడానికి కృషి

వైద్యులు పి.లింగారెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్



హాస్పిటల్‌కు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తూ నిర్విరామ సేవలు చేస్తున్నట్టు వైద్యులు పి.లింగారెడ్డి తెలిపారు. పట్టణంలోని పెర్కిట్ విశాఖ నగర్ కాలనీలో నర్సింగ్ హెూమ్ యందు అత్యధిక పరికరాలతో గ్రామీణ నిరుపేదలకు మంచి వైద్యం అందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. 78వ స్వతంత్ర దినోత్సవం, నవతెలంగాణ వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు. వర్షాల కారణంగా ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి. తగు జాగ్రత్తలు తీసుకుంటే రోగాలు రాకుండా రక్షణ పొందవచ్చు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత తప్పనిసరిగా పాటించాలి. ఏమాత్రం జ్వరం, జలుబు వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యంగా ఉండవద్దు. డెంగీ వ్యాధిపై అవగాహన ఉంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. దోమల నివారణపై శ్రద్ధ పెడితే విష జ్వరాల బారిన పడకుండా ఉండవచ్చు. ముఖ్యంగా సీజనల్ మార్పులతో పెరిగే సూక్ష్మ క్రిములతో వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. భోజనం చేసేముందు తప్పనిసరిగా చేతులు శుభ్రపరచుకోవాలి. నిల్వ పదార్థాలు తినకూడదు. తాజా పండ్లు తీసుకోవాలి. ప్రాణాంతకం కాకముందే జాగ్రత్తలు తీసుకోవాలి. వైద్యుల సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాలి.

చింతలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో

ఓపెన్ స్కూల్ సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదువుకునే వారికి 2024 - 2025 సంవత్సరానికి గాను అడ్మిషన్ షెడ్యూలు ప్రారంభమైందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతలూరు ప్రధానోపాధ్యాయులు వి.లచ్చన్న తెలిపారు. కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో చదువు మానేసినవారు ఇంటివద్ద పనులు చేసుకుంటూనే చదువుకునే అవకాశం జడ్పీహెచ్ఎస్ చింతలూరు కలిపిస్తుంది. ఇంటర్, 10వ తరగతి చదువుకునే విద్యార్థులు 08.08.2024 నుంచి 20.09.2024 వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా అడ్మిషన్ చేసుకోవచ్చు. అపరాధ రుసుంతో 11- 9- 2024 నుండి 3-10-204 వరకు అడ్మిషన్ చేసుకోవచ్చు.

పదవ తరగతి అడ్మిషన్ కొరకు

ఇంతకు ముందు చదివిన తరగతి చెందిన టిసీ.టీసీ లేనట్లయితే పుట్టిన తేదీ సర్టిఫికెట్. ఆధార్ కార్డు, రెండు ఫోటోలు, కులం సర్టిఫికెట్, రెండు సెట్ల జిరాక్స్.

ఇంటర్మీడియట్ చదువుకునే వారు

1) టెన్త్ క్లాస్ మెమో, టిసి, కులం సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, రెండు ఫోటోలు, అన్ని రెండు సెట్ల జిరాక్స్ సబ్మిషన్ చేయాల్సి ఉంటుంది. వివరాలకు గంట అశోక్9440757604 సంప్రదించాలన్నారు



పేదల పత్రికగా పేరుంది

- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి



నవతెలంగాణ-కామారెడ్డి

నవతెలంగాణ పత్రిక ప్రజాశక్తి పత్రికగా ఉన్నప్పటినుంచి పేదల పత్రికగా పేరొందిన పత్రిక. కార్మికుల, కర్షకుల గురించి నిత్యం కథనాలు రాస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న పత్రిక. 8 ఏండ్లు దిగ్విజయంగా పూర్తి చేసుకొని 9వ ఏటలోకి అడుగిడుతున్న సందర్భంగా ఇందులో పని చేస్తున్న సిబ్బందికి, విలేకరులకు, పత్రిక పాఠకులకు, శ్రేయోభిలాషులకు 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు. ఇదే పంథాతో వార్తలు, కథనాలు ప్రచురిస్తూ మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.

విలువలను వీడని పత్రిక

- మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ



నవతెలంగాణ-కామారెడ్డి

ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా విలువలను మాత్రం విడువకుండా పేదల కోసం పనిచేస్తున్న పత్రిక నవతెలంగాణ. వార్తలను అందించడంలో తనదైన ప్రత్యేకతను చాటుతోంది. పేదల పక్షాన నిలుస్తూ నిరంతరం పోరాట ప్రతిమను చూపుతోంది. నవతెలంగాణ పత్రిక విలువలను కాపాడుకుంటూ ఇలాగే కొనసాగాలి. నవతెలంగాణ దినపత్రికలో పనిచేస్తున్న సిబ్బందికి, విలేకరులకు, ప్రతి ఒక్కరికి తొమ్మిదవ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

నాడు మేకల కాపరి.. నేడు అసిస్టెంట్ ప్రొఫెసర్

అంచెలంచెలుగా ఎదిగిన అట్టెం దత్తయ్య.. మారుమూల గ్రామం నుంచి ఢిల్లీ దాకా

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన అట్టెం దత్తయ్య పేద కుటుంబంలో జన్మించాడు. తల్లి లక్ష్మి, తండ్రి మల్లయ్య పిల్లలను పోషించడానికి ఒకవైపు కూలి పనులు చేస్తూ.. మరోవైపు ఉన్న వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కుమారుడిని ఉన్నత చదువులు చదివించాలని ఉన్నా.. ఆర్థిక స్థోమత లేకపోవడంతో శెట్టిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి వరకు చదివించారు. ఇంటి పరిస్థితుల వల్ల ఏడవ తరగతి పూర్తి కాగానే మేకల కాపరయ్యాడు. చదువు మాన్పించి వారికి ఉన్న 40 మేకలు కాస్తుండేవాడు. అయినప్పటికీ ఇంటి పరిస్థితులు బాగో లేకపోవడంతో మేకల కాపరిగా కొనసాగాడు. మేకల కాపరిగా ఏనిమిదేండ్లు గడిచాయి. గుట్టలో చెట్లు, వాగులు, వంకల్లో ఎండ, వర్షం, చలిని సైతం లెక్కచేయకుండా జీవితాన్ని సాగించాడు. తోటి వారంతా ముద్దగా



అట్టెం దత్తయ్యను సన్మానిస్తున్న దృశ్యం

తయారయ్యి పాఠశాలలకు, కళాశాలలకు వెళ్తుంటే లోలోపల బాధపడిన రోజులు, కంటనీరు పెట్టిన గంటలు ఎన్నో ఉన్నాయి. కాపరిగా ఉన్నప్పుడు మేకల మేత కోసం వివిధ ప్రాంతాలకు మన్యం పేరుతో వెళ్లేవాడు. అందులో భాగంగా కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలకు మూడు సంవత్సరాలు వెళ్లాడు. అక్కడ ఫారెస్ట్ అధికారులతో దెబ్బలు, పోలీసులతో బెదిరింపులు ఎన్నో ఎదుర్కొన్నాడు. పశువుల కాపరిగా ఉన్నప్పుడు చిన్న చిన్న కథల పుస్తకాలు, వేమన, సుమతి వంటి శతకాలు, బ్రహ్మంగారు, వెంకటదాసు వంటి వారి కీర్తనలు కంఠస్థాలు చేసేవాడు.

> **పేదరికంతో మేకలు కాస్తూనే విద్యాభ్యాసం చేపట్టాడు. అంతటితో ఆగలేదు.. అంచెలంచెలుగా కష్టపడి చదివాడు. చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించాడు. ప్రస్తుతం ఢిల్లీలోని విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అలాగే సాహిత్య వ్యాసాలూ రాస్తున్నాడు. నిరుపేదలెందరికో ఆదర్శంగా నిలుస్తున్నాడు అట్టెం దత్తయ్య.**

జీవితం మలుపు తిరిగిందిలా..

గోచి గొంగడితో ఒకరోజు సాయంత్రం మేకల దగ్గర నుంచి ఇంటికి వెళ్తున్న చిన్నప్పటి తన సహఅధ్యాయి ఇఫ్తేకర్ డిగ్రి కామారెడ్డిలో చదువుతున్నాడు. అవి సెలవు రోజులు కావడంతో తన ఊరికి వచ్చాడు. అతడు నడుచు కుంటూ వెళ్తున్న దత్తయ్యను చూసి పిలిచాడు. చిన్నప్పుడు చదువుతున్న చురుకుతనాన్ని గుర్తుచేశాడు. ప్రైవేటుగా పదవ తరగతి పరీక్ష రాయాలని సలహ ఇచ్చాడు. ఇఫ్తకర్ ఇచ్చిన సలహాతో ఇతరులను తెలుసుకుని యూసుఫ్ సహాయంతో లింగంపేటలో ప్రైవేటుగా పదవ తరగతి పరీక్ష ఫీజు కట్టి బాగా చదివి పాసయ్యాడు. అలాగే ఇంటర్ సైతం చేసి.. డిగ్రి మొదటి సంవత్సరంలో మొత్తం కాలేజీకే మొదటి ర్యాంకు సాధించాడు. అనంతరం తెలుగు పండిత్ ట్రేనింగ్ నిజామాబాద్‌లో పూర్తి చేశాడు. టి.పి.టి. తర్వాత ఉస్మానియా విశ్విద్యాలయంలో ఎం.ఏ. తెలుగు ప్రవేశ పరీక్షరాసి మంచి ర్యాంకు సాధించాడు. క్యాంపస్ సీటు వచ్చింది. చదువు సాఫిగా సాగింది. పీ.జి.పాఠాలు చెప్తున్న ప్రొఫెసర్ సాగి కమలాకరశర్మ ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ఎం.ఎ.పూర్తి చేశాడు. యు.జి.సి.నెట్, ఏ.పి.సెట్. వంటి నేషనల్ పరీక్షలన్నింటిలో ఉత్తీర్ణుడినయ్యాడు. వెంటనే ఎం.ఫిల్.లో చేరి పూర్తి చేసాడు. నేషనల్ ఫెలోషిప్ సాధించాడు. దానితో పిహెచ్.డి.లో సాగి కమలాకరశర్మ పర్యవేక్షణలో 'మహాభారతంలో సంవాదాలు సమగ్ర పరిశీలన' అనే అంశ మీద చేరాడు. కాల పరిమితికి అనుగునంగా ఐదు సంవత్సరాలలో పూర్తి చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయానికి మార్చి, 28, 2021 సమర్పించాడు. దానిని మూడు విశ్వవిద్యాలయాల ఆచార్యులు పరిశీలించి తెలుగు శాఖ సెప్టెంబర్ 08, 2021న మౌఖిక పరీక్ష పెట్టి సుప్రసిద్ధ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ రెడ్డి, డిఆర్‌డిఓ చైర్మన్ సతీష్ రెడ్డి చేతుల మీదుగా పిహెచ్‌డీ పట్టా పొందాడు. డాక్టరెట్‌ను ప్రకటించారు.

పలు రచనలు..

పి.జి.లో ఉన్నప్పటి నుంచి ఆచార్యుని సహాయంతో సాహిత్య వ్యసాలు రాయడంతో అవి ఇప్పటి వరకు వివిధ పత్రికలలో 80కి పైగా ప్రచురితమయ్యాయి. ప్రత్యేకంగా రెండు పుస్తకాలు ప్రచురించాడు. 'కళ్లం' (సాహిత్య వ్యాసరాశి) 2018, 2. 'తెలంగాణ బి.సి.వాద సాహిత్యం' 2021. ఈ పుస్తకాలతో తనకు గొప్ప గౌరవం దక్కిందని



మేకలు మేపుతున్న దత్తయ్య (ఫైల్)

దత్తయ్య తెలిపాడు. " 'తెలంగాణ బి.సి.వాద సాహిత్యం' అనే గ్రంథాన్ని కాకతీయ విశ్వవిద్యాలయం ఎం.ఏ. తెలుగు వారికి 'రిఫరెన్స్ బుక్' ఎంపిక చేయడం నా అదష్టంగా భావిస్తున్నాను. పై రెండు పుస్తకాలతో పాటు నేను సంపాదకుడిగా రెండు పుస్తకాలు, సహాయ సంపాదకుడిగా నాలుగు పుస్తకాలు వచ్చాయి. తెలంగాణ ప్రసిద్ధ శాసన పరిశోధకుడు బి.ఎన్.శాస్త్రి ప్రారంభించిన ప్రసిద్ధ తెలుగు 'మూసీ' మాస పత్రికకు సహ సంపాదకుడిగా అవకాశం కల్పించడం జరిగింది. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలంగాణ అన్ని విశ్వవిద్యాలయాల నుంచి ఒకే పరిశోధక విద్యార్థిగా నాకు ఒక వేదికకు సమన్వయ కర్తగా 'కరదీపిక'లో అవకాశం లభించింది' అని తెలిపారు. వీటన్నింటితో పాటు జాతీయ, అంతర్జాతీయ 30కి పైగా పత్ర సమర్పణలు చేశానని వివరించారు.

ప్రజల పత్రికకు మనుగడ ఉంటుంది



• రైతు సమన్వయ సమితి ఉమ్మడి మండలాధ్యక్షుడు పిట్ల శ్రీరాములు

నవతెలంగాణ-వర్ని

ప్రజల పక్షాన ఉండే పత్రికలకు మంచి మనుగడ ఉంది. అందుకు ఆదర్శం నవతెలంగాణ పత్రిక. అనుదినం జనస్వరంగా పేదల సమస్యలను రోజువారీగా ప్రభుత్వాలకు ప్రచురిస్తుంది. దేశవ్యాప్తంగా ప్రజల సమస్యలను అధికారుల దష్టికి తెచ్చి ప్రజా పత్రికగా నడుస్తుంది నవతెలంగాణ. కార్మిక, బలహీన బడుగు వర్గాల పత్రికకు ఎప్పుడు ఆదరణ ఉంటుంది. నవతెలంగాణ పత్రికలో రాజకీయాలకు అవసరం అయినంత వరకే రాస్తారు. బడుగు బలహీన వర్గాల బ్రాండ్ పత్రికగా పిలువబడుతుంది నవతెలంగాణ. ప్రజల సమస్యలను ఎక్కువగా రాయటం నవతెలంగాణ పత్రిక గొప్పతనం. ఈ పత్రిక ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో నడువాలని కోరుతున్నాం. నవతెలంగాణ 9వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా యాజమాన్యానికి, సిబ్బందికి, మండల స్థాయి విలేకరులకు శుభాకాంక్షలు.

శ్రామిక ప్రజల గొంతుక



• ఐఎఫ్‌టీయూ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరదయ్య

నవతెలంగాణ-బోధన్

నవతెలంగాణ పత్రిక శ్రామిక ప్రజల గొంతుకగా పనిచేస్తుంది. బుర్జువా పత్రికలకు భిన్నంగా, కార్మిక పక్షపాతంగా పత్రిక నిలిచింది. అసంఘటిత రంగ కార్మికులకు భరోసాగా పత్రిక నిలబడింది. ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తుంది. రైతు, మహిళ, విద్యార్థి, యువజనుల సమస్యలపై గళమెత్తింది. ప్రభుత్వాలను నిలదీసింది. దళిత, గిరిజనుల వెతలను ప్రభుత్వాల దృష్టికి తెచ్చింది. నిత్యం పీడిత ప్రజలకు అండగా నిలిచింది. భావ ప్రకటన స్వేచ్ఛకై పోరాడింది. ప్రజా సమస్యల పరిష్కారానికి కషి చేస్తున్న నవతెలంగాణ పత్రిక నిరంతరం వర్ధిల్లాలి. నవతెలంగాణ 9వ వార్షికోత్సవం సందర్భంగా కార్యాలయ ఉద్యోగులకు, విలేకరులకు శుభాకాంక్షలు.

మంచి గుర్తింపు సాధించుకున్న దినపత్రిక

• కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



ఒక మంచి గుర్తింపు సంపాదించు కున్న దినపత్రిక నవతెలంగాణ పత్రిక. నవతెలంగాణ దినపత్రిక తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా దినపత్రికలో పనిచేస్తున్న సిబ్బందికి, విలేకరులకు వార్షికోత్సవ శుభాకాంక్షలు. ప్రజల సమస్యలను గుర్తించి వాటిని ప్రచురించి ముందుకు తీసుకువెళ్తుంది. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎవరి ప్రలోభాలకు లొంగకుండా సమస్య పరిష్కారానికి ప్రజలందరిని చైతన్యం చేయడంలో నవతెలంగాణ పత్రిక కీలకపాత్ర పోషిస్తుంది. సామాజిక న్యాయంతో అందరి అన్ని రకాల హక్కులు అందాలంటూ తనదైన శైలిలో వార్త కథనాలు అందించే పత్రిక నవతెలంగాణ దినపత్రిక.

నవతెలంగాణ ప్రజలపత్రిక

• వర్ని ఎస్ఐ కృష్ణకుమార్



నవతెలంగాణ-వర్ని

బడుగు బలహీన వర్గాల కోసం పని చేస్తుంది నవతెలంగాణ పత్రిక. పేదలు, మహిళలు, యువత, కార్మికులు, కర్షకులు, విద్యార్థుల పక్షాన అక్షర రూపంలో సేవలు అందిస్తుంది నవతెలంగాణ పత్రిక. ఇక ముందు కూడా నవతెలంగాణ విజయవంతంగా ముందుకు నడవాలని ఆకాంక్షిస్తూ పత్రిక సిబ్బంది అందరికీ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

c m y k

పేదోళ్ల గొంతుక

● మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే



నవతెలంగాణ-నిజాంసాగర్

నవతెలంగాణ దినపత్రిక మారుమూల గ్రామంలో బడుగు, బలహీన వర్గాల వారికి ఒక ఆయుధం లాంటిది. నిరంతరం ఈ పత్రిక పేదల గొంతుకగా పనిచేస్తుంది. ఇది ఒకప్పుడు ప్రజాశక్తిగా ఉండేది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాక.. తెలంగాణలో ప్రజాశక్తి వారసురాలిగా నవతెలంగాణగా ఆవిర్భవించింది. ఈ శుభ సందర్భంగా నవతెలంగాణ పాఠకులకు, సిబ్బందికి, విలేకరులకు 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.







అన్నివర్గాల గళాన్ని వినిపించే పత్రిక

● ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత



నవతెలంగాణ-కంఠేశ్వర్

అన్ని వర్గాల సమస్యలపై తనదైన గళాన్ని వినిపించే పత్రిక నవ తెలంగాణ దినపత్రిక. కులం, మతం, వర్గం అనే తేడాలు లేకుండా సామాజిక దృష్టితో అన్ని వర్గాల ప్రజలను చైతన్యం చేయడంకోసం నిరంతరం పరితపించే పత్రిక. ప్రజలకు, ప్రభుత్వాలకు వారధిగా ఉంటూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వార్తా కథనాల రూపంలో ప్రభుత్వం దృష్టికి తెచ్చి, వాటిని పరిష్కరించడంలో ఎనలేని కృషి చేస్తుంది. ఎలాంటి వ్యాపార దృక్పథం లేకుండా సమాజ శ్రేయస్సు కోసం నిజాలను నిర్భయంగా, నిష్పక్షపాతంగా రాస్తున్న నవతెలంగాణ దినపత్రిక మున్ముందు ఇలాంటి ఎన్నో వసంతాలను పూర్తి చేసుకోవాలి.









స్త్రీనిధిలో నిజామాబాద్‌కు అవార్డు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



స్త్రీనిధి 11వ సర్వ సభ్య సమావేశంలో నిజామాబాద్‌కు అవార్డు వరించింది. గ్రామీణ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మాత్యులు ధనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా నిజామాబాదు జిల్లా డీఆర్డీఓ డి. సాయగౌడ్‌కు అవార్డును అందించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ లోకేష్ , సెర్ప్ సీఈఓ దివ్య దేవా రాజన్, జడ్ ఎం - అనంత కిషోర్, రవికుమార్ - జెడ్ ఎం, గా, ఆర్ఎం - రాందాస్, జిల్లా సమాఖ్య ఇసి సభ్యులు హాజరైనారు. రాష్ట్రంలోనే స్త్రీనిధి అన్ని కార్యక్రమలలో మొదటి స్థానం సాధించిన కమ్మర్‌పల్లి మండల సమాఖ్యకు సైతం మంత్రి చేతుల మీదుగా అవార్డును కమ్మర్‌పల్లి ఏపీఎం గంగారెడ్డి, సమాఖ్య అధ్యక్షులుకుఅందించారు.

పాకెట్‌లో పేలిన రెడ్‌మీ సెల్‌ఫోన్

నవతెలంగాణ-పిట్లం

ఒక వ్యక్తి ప్యాంటు ప్యాకెట్లో మొబైల్ ఫోన్ హఠాత్తుగా పేలిన ఘటన మండల కేంద్రంలో బుధవారము చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన ఎనిగే సాయులు ఆర్‌యంపి తన రెడ్‌మీ మొబైల్ ఫోన్ ను ఎప్పటి అలాగే ప్యాంటు ప్యాకెట్‌లో పెట్టుకోగా ఒక్కసారిగా శబ్దం రావడంతో మొబైల్ ఫోన్ తీద్దామనే క్రమములో మంటలు అంటీ ప్యాంటు ప్యాకెట్ కాలిపోయింది. ఆయనకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో తృటిలో పెనుప్రమాదం తప్పినట్టయింది.



సెల్‌ఫోన్ పేలడంతో కాలిన జేబు

మున్సిపల్‌లో ప్రక్షాళన షురూ

- నేరుగా రంగంలోకి దిగిన కమిషనర్ మకరంద్
- ఉద్యోగులు, సిబ్బందిలో జవాబుదారీతనం పెరిగేలా చర్యలు
- సర్కిళ్ల పరిధిలో బదిలీలు
- కంప్లైంట్ ఉంటే వాట్సాప్‌నెంబర్ 7815957047కి ఫిర్యాదు చేయాలని సూచన

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్/కంఠేశ్వర్

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రక్షాళన షురూ అయింది. ఇటీవల మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ నరేందర్ ఆదాయానికి మించి ఆస్తులున్నట్టు ఏసీబీ అధికారులు రైడ్ చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇది వరకే మున్సిపల్ అంటేనే అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా భావించేవారు. ఏసీబీ ఘటనలో కార్పొరేషన్‌కు మాయని మచ్చగా మిగిలింది. దీన్ని చెరిపేసేందుకు మున్సిపల్ కమిషనర్ నేరుగా రంగంలోకి దిగారు. సర్కిల్ పరిధిలో శానిటేషన్, ఇంజినీరింగ్ సెక్షన్ ఉద్యోగులను బదిలీ చేపట్టారు. మరిన్ని బదిలీలు ఉండనున్నట్టు తెలిపారు. అదే విధంగా మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది జవాబుదారీతనంగా పని చేసేలా మోటీవేట్ చేస్తున్నారు. తాజాగా ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.



మున్సిపల్ కార్యాలయం



సర్కిల్ పరిధిలో బదిలీలు

ఇటీవల కాలంలో మున్సిపల్‌లో వివిధ విభాగాల అధికారుల విధుల మీద అనేక ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో పారిశుధ్య, ఆరోగ్య విభాగంలో పనిచేయుచున్న శానిటరీ ఇన్స్‌పెక్టర్, సర్కిల్ సూపర్వైజరీ ఆఫీసర్లను ప్రస్తుతం వారు పనిచేయుచున్న సర్కిల్ నుండి ఇతర సర్కిల్స్ కి ట్రాన్స్‌ఫర్ చేస్తూ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. దశల వారీగా అన్ని విభాగాలలో ప్రక్షాళన చేస్తూ ఉత్తర్వులు ఇవ్వనున్నారు. పన్నులు, రెవెన్యూ విభాగంలో కూడా, నూతనంగా చేరిన సిబ్బంది, ప్రస్తుతం ఉన్న సిబ్బందితో ప్రక్షాళన చేస్తూ ఉత్తర్వులు ఇవ్వనున్నారు. వారికి తగిన ట్రైనింగ్ సైతం ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా వారి పనితీరు మీద నిరంతర పర్యవేక్షణ చేయనున్నారు.

జాప్యానికి, అవినీతికి తావులేకుండా

అన్ని విభాగాలలో పని చేయుచున్న అధికారులు, సిబ్బంది ఎలాంటి జాప్యానికి, అవినీతి ఆరోపణలకు, పక్షపాతానికి తావు లేకుండా విధులు నిర్వహించాలని కమిషన్ ఇది వరకే ఆదేశాలు జారీ చేశారు. నిర్దీత సమయం పరిధిలో చేపట్టాల్సిన పనులు సకాలంలో పూర్తి చేయాల్సి ఉంటుంది. లేనిచో తగిన విచారణ చేసి, చట్టరీత్యా తగిన కఠిన చర్యలు తీసుకోబడును.

ఆకస్మిక తనిఖీలు.. చర్యలు

మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. ఇటీవల కంఠేశ్వర్ జోన్‌లో రాత్రి సమయంలో ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో, ఇద్దరు పొరుగు సేవల ఉద్యోగులు కార్యాలయంలోనే మద్యం సేవించిన ఘటన వెలుగు జూసింది. విచారణ తర్వాత వారిని ఉద్యోగం నుంచి తొలగించారు. ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీల ద్వారా సిబ్బంది పనితీరు గమనించి తగిన చర్యలు తీసుకోనున్నారు. సిబ్బందిలో సమయపాలన, జవాబుదారీతనం, పారదర్శకత పెంపొందించడానికి తగిన చర్యలు తీఉకుంటున్నారు.

జాప్యం చేసినా, డబ్బులు అడిగినా ఫిర్యాదు చేయొచ్చు

వివిధ పనుల నిమిత్తం సకాలంలో పూర్తి చేయకుండా జాప్యానికి కారణం అయిన అధికారులపై సిబ్బందిపైన తగిన విచారణ తర్వాత చర్యలు తీసుకోనున్నట్టు కమిషనర్ తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో బిల్డింగ్ పర్మిషన్ ఇతర సేవలు టీఎస్‌బీపాస్ అనే ఆన్‌లైన్ విధానంలో అందించనున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులను నేరుగా ఎవరు కలవాల్సిన అవసరం లేదు, నియమావళికి విరుద్ధంగా నిర్మాణాలు చేయరాదు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది మరియు ఇతర సిబ్బంది సంస్థ సేవలకోసం, ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే, 14420 అనే టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా కాంప్లెంట్ చేయాలని సూచించారు. అదే విధంగా ఇంకొక జనరల్ ఫోన్ నెంబర్ 08462- 221001 ద్వారా కూడా కంప్లైంట్ చేయవచ్చు. దీంతో పాటు కమిషనర్‌కు నేరుగా వాట్సాప్ నెంబర్ 7815957047 ద్వారా సైతం ఫిర్యాదు చేసేలా అవకాశం కల్పించారు. సిబ్బంది మీద ఆరోపణలు వస్తే, తగిన విచారణ తర్వాత చర్యలు తీసుకొనున్నారు.

నగరపాలక సంస్థ సిబ్బంచే - సమగ్రత ప్రతిజ్ఞ

నగరపాలక సంస్థ ఉద్యోగుల మీద వివిధ ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో కమిషనర్ మకరంద్ బుధవారం అన్ని విభాగాల ఉద్యోగులు సిబ్బందితో మీటింగ్ నిర్వహించారు. సిబ్బంది పాటించాల్సిన నియమావళి గురించి తెలియజేసి, అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు విధులలో ఎలాంటి పొరపాట్లు, అవినీతి చేయబోమని సిబ్బందితో - సమగ్రత ప్రతిజ్ఞ - చేయించారు.

మధ్యాహ్నం 3 నుంచి 5 వరకు అందుబాటులో



నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ మకరంద్ ప్రజలకు అందుబాటులో ఉండేందుకు సమయం కేటాయించుకున్నారు. అన్ని పనిదినాలలో మధ్యాహ్నం 3 గంల నుండి సాయంత్రం 5గంల వరకు తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. నగరపాలక సంస్థలో వివిధ సేవల కోసం కార్యాలయానికి వచ్చే నగరప్రజలు వారి దరఖాస్తులు నేరుగా పౌరసేవకేంద్రంలో సమర్పించ వచ్చు, నిర్దీత సమయంలో వాటిని పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నారు. విభాగాల అధికారులు మరియు సిబ్బంది నిర్దీత సమయంలో దరఖాస్తులను పరిష్కరించకపోతే దరఖాస్తుదారులు, నగర ప్రజలు అన్ని పనిదినాలలో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల మధ్యలో నేరుగా కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు అందజేయవచ్చు. కమిషనర్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నప్పుడు, గ్రీన్ లైట్ ద్వారా తెలియజేయనున్నారు. క్షేత్ర పర్యవేక్షణ మీటింగులు ఇతర కారణాలతో కమిషనర్ అందుబాటులో లేకుంటే కార్యాలయ మేనేజర్‌కు గానీ, టప్పాలో గానీ అందజేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు.

ఫైన్‌ల కోసం కాదు.. ప్రాణాలు కాపాడేందుకే హెల్మెట్

- నేటి నుంచి ప్రతి ద్విచక్రవాహనదారుడు ధరించాల్సిందే
- తనిఖీలు ముమ్మరం చేపడతాం
- నవతెలంగాణతో సీపీ కల్మేశ్వర్

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్/కంఠేశ్వర్



'ప్రమాదవశాత్తు చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మృతులు ద్విచక్రవాహన దారులే. రోడ్డు ప్రమాద సమయంలో తలకు బలమైన గాయాలు కావడంతోనే మృత్యువాత పడుతున్నారు. అదే సమయంలో హెల్మెట్ ఉంటే గాయాలతో బయటపడే అవకాశం ఉంటది. హెల్మెట్ వినియోగంపై పోలీస్‌శాఖ తరఫున అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. అయినా పలువురిలో మార్పు రావడం లేదు. అందుకు పంద్రాగస్టు నుంచి హెల్మెట్ ధారణ ఖచ్చితంగా అమలు చేస్తున్నాం. ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించాలి. ఇదేదో ఫైన్‌ల కోసం అమలు చేస్తున్న నిబంధనకాదు. ప్రజల ప్రాణాల రక్షణలో భాగంగా పోలీస్‌శాఖ తరఫున చర్యలు తీసుకుంటున్నట్టు' నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ సింగనార్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15వ తేదీ నుంచి ద్విచక్రవాహన దారులకు హెల్మెట్ తప్పని సరి నిబంధనలు అమలు చేయనున్న నేపథ్యంలో నవతెలంగాణ సీపీని కలిసి ముచ్చటించింది. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

హెల్మెట్‌లేకనే మృత్యువాత

రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకపోవడంతోనే మృత్యువాత పడుతున్నారు. ప్రమాద సమయంలో తలకు బలమైన గాయాలు కావడంతో ఘటనా స్థలంలో కొందరు, తీవ్ర గాయాలతో ఆస్పత్రికి చేరిన తర్వాత మరికొందరు మృత్యువాత పడ్డారు. ప్రమాద సమయంలో హెల్మెట్ ఉంటే.. గాయాలతో బయటపడే అవకాశం ఉంది. ఇంటి పెద్దదిక్కును కోల్పోయి అనే ఇక్కట్లు పడుతున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. అలా మరిన్ని కుటుంబాలు శోకానికి గురికావొద్దనే ఉద్దేశ్యంతోనే హెల్మెట్ నిబంధనను ఖచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. హెల్మెట్ ధరించడంతో ఒక్క ప్రమాద సమయంలోనే కాకుండా.. వర్షం, ఎండ, చలి నుంచి మనల్ని కాపాడుతుంది.

హైవే మీదే కాదు.. పట్టణ కేంద్రాల్లోనూ ధరించాల్సిందే

కొందరు హైవేల మీద ప్రయాణ సమయాల్లో ధరిస్తున్నామని, కానీ పట్టణ కేంద్రాల్లో ఎందుకు ధరించాలని అడుగుతుంటారు. హైవేలతో పాటు పట్టణ కేంద్రాల్లో సైతం బైక్‌మీద ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్ ధరించాల్సిందే. పట్టణ కేంద్రాల్లో చోటుచేసుకుంటున్న ప్రమాదాల్లోనూ ద్విచక్రవాహనదారులే మృత్యువాత పడుతున్నారు. వాహనాల మధ్య చిన్న గ్యాప్ ఉన్నా.. దూసుకుని వెళ్లేందుకు ప్రయత్నిస్తూ.. సడెన్‌గా వాహనాలు ఎదురుగా వచ్చి చోటుచేసుకున్న ప్రమాదాల్లో సైతం మృతిచెందిన ఘటనలు కోకొల్లలు.

ఎక్కడికక్కడ తనిఖీలు



హెల్మెట్ నిబంధనను పక్కాగా అమలు చేసేందుకు ఎక్కడికక్కడ ట్రాఫిక్ పోలీసులతో తనిఖీలు చేపట్టే ప్రణాళిక రూపొందించాం. ఫైన్‌లు రాబట్టుకోవాలనే ఉద్దేశ్యంతో కాకుండా.. ద్విచక్రవాహన దారులందరూ హెల్మెట్ ధరించాలనే ముఖ్య ఉద్దేశ్యంతోనే పోలీస్‌శాఖ ముందుకు వెళ్తుంది. కావున ప్రజలందరూ పోలీసులతో సహకరించాలని కోరుతున్నట్టు సీపీ తెలిపారు.

నగరం బంద్ పాక్షికం

- 11 గంటల తరువాత క్రమంగా తెరుచుకున్న దుకాణ సముదాయాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కంఠేశ్వర్

మత ప్రాతిపదికన చేపట్టే కార్యక్రమాలకు ప్రజల మద్దతు ఉండబోదని ప్రజలు మరోసారి నిరూపించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై మారణకాండను నిరసిస్తూ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన నగరం బంద్ పాక్షికంగా సాగింది. ప్రధాన రోడ్ల మీద వ్యాపారాలు పదకొండుగంటల తర్వాత యథావిధిగా కొనసాగాయి. దుకాణాలు తెరిచి ఉంటే ఎవరైనా వచ్చి దాడి చేస్తారేమో అన్న భయంతో పలువురు మూసి వేసి ఉంచగా.. క్రమంగా పదకొండు గంటల తర్వాత క్రమంగా తెరుస్తూ వచ్చారు. 12 గంటల తర్వాత పూర్తిగా తెరుచుకున్నాయి. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. గాంధీ చౌక్‌తో పాటు బస్టాండ్, నెహ్రూపార్క్ తదితర ప్రాంతాల్లో పోలీసులు గస్తీకాశారు.



బస్టాండ్ -గాంధీచౌక్ రోడ్డులో తెరిచి ఉన్న దుకాణాలు

కాగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త ప్రధాన రోడ్లమీద తిరుగుతూ తెరిచి ఉన్న దుకాణాలను మూసివేయాలని కోరారు. బంద్ ఎందుకు చేపట్టారో వ్యాపారులకు వివరించారు.







శ్రీదేవి థియేటర్ గల్లీలో తెరిచి ఉన్న దుకాణాలు, బైక్‌ల పార్కింగ్.. హరితహోటల్ చౌరస్తా వద్ద ఉదయం వేళ మూసిఉన్న దుకాణాలు.. ధన్‌పాల్ ర్యాలీ

ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి

- ఎస్సీ ఎస్టీలలో క్రిమిలేయర్ రాజ్యాంగ విరుద్ధం
- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు

నవతెలంగాణ-కామారెడ్డి

నూటికి ఎనభై శాతం పెరిగిన ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు లేకపోవడం వల్ల మెజారిటీ ప్రజలకు సరైన విద్య ఉపాధి అవకాశాలు అందటం లేదని ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయగలిగితేనే రాజ్యాంగబద్ధంగా సామాజిక న్యాయం దక్కుతుందని ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమించాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్)జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా నాయకులు కే రాజనర్సు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకి అమ్మేసిందన్నారు. రోజురోజుకీ ప్రైవేటు రంగం పెరుగుతుందని అందులో అట్టడుగు ప్రజలకు రిజర్వేషన్ లేకపోవడం వల్ల విద్యా ఉపాధి ఆశించినంతగా అందడం లేదన్నారు. ప్రైవేట్ రంగం పెరుగుదల వల్ల సామాజిక న్యాయం సమాధి చేయబడుతుందన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో బిల్లు పెట్టాలన్నారు. దళిత గిరిజన బలహీన వర్గాల పట్ల బిజెపికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణమే బిల్ పెట్టాలన్నారు. కులగణన చేపట్టకుండా బిజెపి అడ్డుకుంటుందన్నారు. దేశవ్యాప్తంగా దళితులు 20 శాతం ఉండగా కేంద్ర బడ్జెట్ లో మాత్రం 11 శాతం నిధులు కేటాయించి అందులో కేవలం 3.2 శాతం మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు.



మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

రాజ్యసభలో, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులలో ఎందుకు రిజర్వేషన్లు అమలు చేయట్లేదని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ సందర్భంగా ఎస్సీ, ఎస్టీలకు క్రిమిలేయర్ పెట్టాలని ఆ సందర్భంగా వాదించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. దళితులలో ఒకరో ఇద్దరో సంపన్న వర్గం పెరిగితే వారి రిజర్వేషన్లు రద్దు చేయాలంటూ చర్చించడం సరికాదన్నారు. క్రిమిలేయర్ విధానాన్ని దళితులు సమైక్యంగా అడ్డుకుంటారని పేర్కొన్నారు. ఆగస్టు 27న కామారెడ్డిలో పూలే అంబేద్కర్ ఆలోచనలు సామాజిక న్యాయం అనే అంశంపై జిల్లా స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు వెంకట్ గౌడ్, కెవిపిఎస్ జిల్లా నాయకులు నరసింహ, ప్రభు, రతన్, మోహన్, స్వామి, మహబూబ్, మహిళలు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో జూనియర్ డాక్టర్ల విధుల బహిష్కరణ



ఆస్పత్రి ఎదుట బైటాయించిన జూడాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కోల్ కతాలోని ఆర్జీకార్ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో వైద్యురాలిపై లైంగికదాడి, హత్యను నిరసిస్తూ జిల్లా జనరల్ ప్రభుత్వ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్లు బుధవారం విధులను బహిష్కరించారు. ఈ ఘటనపై గత కొన్ని రోజులుగా నిరసన తెలుపుతున్న తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టాలను తేవాలనే డిమాండ్‌తో విధులను బహిష్కరించింది. ఈ సందర్భంగా జూడా అధ్యక్షుడు డాక్టర్ జతీన్ మాట్లాడుతూ.. వైద్యులకు విధుల పరంగా రక్షణ లేకుండాపోయిందన్నారు. సేవా భావంతో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులపై దాడులు, హత్యలు దారుణమన్నారు. జూడాలు విధులు బహిష్కరించడతో ఓపీ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

రేషన్ డీలర్ల ఎంపికలో గోల్‌మాల్

- ఇంటర్వ్యూల పేరుతో మోసం
- నచ్చిన వారికే ఎంపిక.. అధికారుల చేతివాటం
- నిరసన చేపట్టిన పలువురు

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

బాన్సువాడ డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో ఖాళీ అయిన రేషన్ డీలర్ల భర్తీ కోసం ఇటీవల అధికారులు నోటిఫికేషన్ విడుదల చేయగా అర్హుల ఎంపికలో అక్రమాలు జరిగినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. అర్హత పరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చినా ఇంటర్వ్యూలో తక్కువ మార్కులు వేసి అనర్హులను ఎంపిక చేసినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. డిగ్రీ, పీజీ చదివిన వారి కంటే పదో తరగతి చదివిన వారికి, రాజకీయ అండదండలు ఉన్న వారి అనుచరులనే ఎంపిక చేసినట్లు చెబుతున్నారు. దీనిపై పలువురు బాధితులు బాన్సువాడ ఎంపీడీవో కార్యాలయం ఎదుట అందువలన ధర్నా చేశారు.



నిరసన చేపడుతున్న పలువురు అభ్యర్థులు

ఇంటర్వ్యూలో గోల్ మాల్

బాన్సువాడ డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో వివిధ గ్రామాల్లో 28 డీలర్లు ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల నియామకాలకు ప్రభుత్వ సూచన మేరకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. దీనితో 297 మంది దరఖాస్తు చేసుకోగా ఈ నెల 14న 285 మంది దరఖాస్తుదారులు పరీక్ష రాశారు. నేడు 282 మందికి ఇంటర్వ్యూలు నిర్వచించారు. రాత పరీక్షలో 80 మార్కులకు గాను నేడు 20 మార్కులకు అధిక మార్కులు ఇంటర్వ్యూ చేపట్టిన అధికారులు ఈ రెండింటిని ఆధారంగా చేసుకొని నేడు ఎంపికైన వారి జాబితాను ప్రకటించారు. తుది దశగా నిర్వహించిన ఇంటర్వ్యూలో పీజీలు, డిగ్రీలు చదివి అత్యధిక మార్కులు పొందిన వారికి జీరోలు వేసి, పదో తరగతి చదివి అత్యల్ప మార్కులు పొందిన వారికి 20 కి 20 మార్కులు వేశారని. దాంతో రేషన్ డీలర్ల పరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చిన వారికి ఇంటర్వ్యూలో నిరాశ ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు.



ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

- చెస్ బాక్సింగ్ ఛాంపియనిషిప్‌లో సత్తాచాటిన పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ నుంచి కామారెడ్డి జిల్లాకు చెందిన క్రీడాకారులు చెస్ బాక్సింగ్ ఛాంపియన్షిప్‌లో సత్తా చాటగా వారిని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అభినందించారు. పిట్లంకు చెందిన తక్కడపల్లి ప్రతిభ ఐదు బంగారు, వెండి పతకాలు సాధించారు. విజయ రాఘవేందర్ రెండు వెండి పతకాలు పొందారు. ఏషియన్ గేమ్స్ లో ఒకటి, ఇండియన్ ఓపెన్ గేమ్ లో ఒకటి చొప్పున పతకాలు పొందారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన తక్కడపల్లి ప్రతిభ, విజయ రాఘవేందర్ లకు శాలువాలు కప్పి అభినందించారు.



విజయరాఘవేందర్, ప్రతిభను సన్మానించిన కలెక్టర్

పరేడ్ గ్రౌండ్ పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్ బుధవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలించారు. ఆగస్టు 15న పరేడ్ గ్రౌండ్లో జాతీయ జెండా ఆవిష్కరణ సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించి అక్కడున్న పోలీస్ అధికారులను ఏర్పాట్లపై కావడానికి ఎంత సమయం పడుతుందని అడిగి తెలుసుకున్నారు. జాతీయ పతాక ఆవిష్కరణ ప్రాంతంతో పాటు గ్రామంలోని చుట్టుపక్కల పరిశీలించారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు పోలీస్ మైదానాన్ని నిజామాబాద్ పోలీస్ శాఖ తరఫున పూర్తి ఏర్పాట్లను చేయనున్నారు.



ఏర్పాట్లపై సూచనలిస్తున్న మున్సిపల్ కమిషన్ మకరంద్

మాజీ క్రికెటర్ చేతులమీదుగా అవార్డు అందుకున్న స్మైల్స్ పాఠశాల డైరెక్టర్ రఫీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని స్మైల్స్ పాఠశాల డైరెక్టర్ రఫీ ఇటీవల ఢిల్లీలో జరిగిన ఇంటర్నేషనల్ ఈవెంట్‌లో మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ చేతుల మీదుగా బెస్ట్ ప్రైస్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో చిన్నారులకు విద్య బోధనతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ముందంజలో ఉండేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. స్వతంత్ర దినోత్సవ, నవ తెలంగాణ వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న పాఠశాల డైరెక్టర్

స్వాతంత్ర సమరయోధులకు సన్మానం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులచారి అధ్యక్షతన వినాయక కల్యాణ మండపంలో స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న ఫ్రీడమ్ ఫైటర్స్ కుటుంబ సభ్యులు ఉమామహేష్ సిర్‌పుర్కర్‌ని, మంగేష్ కుమార్ సిర్‌పుర్కర్ సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ వ్యాపారాల కోసం మన భారతదేశనికి వచ్చిన బ్రిటీష్‌వారిని భారతమాత దాస్య సంకెళ్లు తెంచడానికి ఎందరో వీరులు తమ ప్రాణాలను అర్పించారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రకాష్ రెడ్డి, మోహన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతంకర్ లక్ష్మి నారాయణ, అసంబ్లీ కోకన్వీనర్ నారాయణ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ఏఐపీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులుగా బోడ అనిల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా బోడ. అనిల్ ఎన్నికైనట్టు బుధవారం తెలిపారు. అఖిల భారత ప్రతిశీల విద్యార్థి సంఘం (ఏఐపిఎస్‌యూ) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు(12,13) రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారని అన్నారు. అనంతరం మూడో రోజు ప్లీనం నిర్వహించి నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులుగా బోడ.అనిల్, రాష్ట్ర కార్యదర్శిగా మన్నెకుమార్‌ను ఎన్నుకున్నట్లు ఆర్ఎస్పి పార్టీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు ప్రకటించారని తెలిపారు. నూతన రాష్ట్ర అధ్యక్షులు బోడ.అనిల్ మాట్లాడుతూ.. భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం, శాస్త్రీయ విద్యా విధానాన్ని అభివృద్ధి చేయాలని నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసే విధంగా భవిష్యత్తు పోరాటాలు ఉంటాయని అన్నారు పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ 8214కోట్లు, సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, మెస్ కాస్మొటిక్ చార్జీలను పెంచే దిశగా ఈ ప్రభుత్వం పునుకోవాలని అన్నారు.

ఆకస్మిక ప్రమాదాల నివారణపై అవగాహన



ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ -1, యూనిట్ -2లో భాగంగా గురువారం అగ్నిమాపక రక్షక దళం (ఫైర్) ఆధ్వర్యంలో కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకస్మికంగా సంభవించు సిలిండర్ ప్రమాదాలు, నీటిలో మునిగిపోవటం అగ్నికి ఆహుతి ప్రమాదాలపై మనల్ని మనం ఎలా బయటపడాలనే దానిపై పరికరాలను ఉపయోగించి విద్యార్థులకు అవగాహనను కల్పించారు. అంతేకాకుండా ఏవైనా ప్రమాదాలు సంభవించినప్పుడు చేయవలసిన ఫోన్ నెంబర్ వివరాలను కూడా తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జయపాల్‌రెడ్డి మాట్లాడుతూ తమని తాము కాపాడుకోవడమే కాదు.. ఇతరులను కూడా కాపాడినప్పుడే అది సంఘసేవ అవుతుందని అన్నారు. కనుక విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపకాధికారి గంగ స్వామి, ఎన్ఎస్ఎస్ అధికారి వి.కృష్ణదాస్, అధ్యాపకులు, అగ్నిమాపక సిబ్బంది రమేష్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు

డ్రగ్స్‌పై పోరాడాలి

- నూతన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- హాజరైన తెలంగాణ రెడ్‌క్రాస్ జిల్లాల చైర్మన్లు, పాలకమండలి సభ్యులు



పుష్పగుచ్ఛ అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నూతన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో రాష్ట్ర పాలకమండలి సభ్యులు, జిల్లా చైర్మన్ల సమావేశం గురువారం రాజ్‌భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర చైర్మన్ అజయ్ మిశ్రా ఐఏఎస్ రిటైర్డ్ గవర్నర్ సెక్రెటరీ బుర్ర వెంకటేశ్వర్లు, భవాని శంకర్, సంయుక్త కార్యదర్శి ఓఎస్ రెడ్డి, కోశాధికారి, జిల్లా,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్(నిజామాబాద్‌కు చెందిన) వివిధ జిల్లాల చైర్మన్లు పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సభ్యులను ఉద్దేశించి రాష్ట్ర గవర్నర్ తెలంగాణ రెడ్ క్రాస్ కుటుంబంలో నేను కూడా ఒక సభ్యున్ని అని అన్నారు. అందరం కలిసి తెలంగాణ రెడ్ క్రాస్‌ని బలోపేతం చేసి మానవ సంబంధిత కార్యక్రమాలను చేపడదామని చెప్పారు. డ్రగ్స్‌పై పోరాడాల్సిన అవసరం ఉందని, యువతను విద్యార్థులను అప్రమత్తం చేయాల్సిన పని ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

జీపీ సిబ్బందికి వేతనాలను చెల్లించాలని వినతి



ఎంపీఓకు వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నవీపేట్

గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని లేదంటే సమ్మెకు దిగుతామని సిఐటియు ఆధ్వర్యంలో ఎంపీడీవో నాగనాథ్, ఎంపీఓ రామకృష్ణకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాయక్‌వాడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో గ్రామపంచాయతీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ విషయమై సంఘాలు ఆందోళన చేయగా ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసిన కార్మికుల జీతాలు చెల్లించలేదన్నారు. ట్రాక్టర్, కరెంట్ బిల్లు బకాయిలతోపాటు నిర్వాహణ ఖర్చులను ఉపయోగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన గ్రాంట్ లో 75శాతం కార్మికుల జీతాలకు చెల్లించిన తర్వాతనే మిగతా వాటికి వినియోగించాలని తెలిపారు. లేకుంటే భవిష్యత్తులో సమ్మె చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మేకల ఆంజనేయులు, కారోబార్ జిల్లా కమిటీ సభ్యులు మీన్ కుమార్, మంత్రి నరేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

- బంగ్లాదేశ్‌లో మైనార్టీ హిందువులపై దాడులకు నిరసన

నవతెలంగాణ-కంఠేశ్వర్

బంగ్లాదేశ్‌లో మైనార్టీ హిందువులపై జరుగుతున్న హత్యలను ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఆఫ్ ఫెడరేషన్ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు బుధవారం నిజామాబాద్ బార్ అసోసియేషనస్ మల్లెపూలు జగన్మోహన్ గౌడ్ అధ్యక్షతన అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీ హిందువులపై హత్య దాడులను ఖండిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం జిల్లా కోర్ట్ ప్రధాన గేటు ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. బంగ్లాదేశ్లో మైనార్టీ హిందువుల హత్యలు, దాడులు, ఆస్తులు ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ అరాచకాలపై అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు రాజకీయ పార్టీలు స్పందించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. రిజర్వేషన్ ఉద్యమంగా ప్రారంభమై మతోన్మాద తీవ్రవాదులు బంగ్లాదేశ్‌లో హిందువులపై పథకం ప్రకారం దాడులు చేయడంపై ఐక్యరాజ్యసమితి, భారత ప్రభుత్వం చొరవ తీసుకొని అక్కడి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. నిరాశ్రయులైన హిందువులకు భారత ప్రభుత్వం ఆశ్రయం కల్పించి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు ఎం రాజేందర్ రెడ్డి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వసంత్ రావు, సంయుక్త కార్యదర్శి దంపల్ సురేష్, లైబ్రరీ కార్యదర్శి పిల్లి శ్రీకాంత్, న్యాయవాదులు పడిగల వెంకటేశ్వర్, యెర్రం విఘ్నేష్, తుల గంగాధర్, మానిక్ రాజ్, బిట్ల రవి, విశ్వక్ సేవ్, మధు, అరెటి నారాయణ, దేవదాస్, పుణ్యారాజ్, బాలాజీ, ఆశ నారాయణ, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

సిజిహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వివిధ డిపార్ట్‌మెంట్లకు చెందిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు తమ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమ సమన్వయ కమిటీ తరపున సిజిహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ నిజామాబాద్‌లో ఏర్పరచాలని పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్‌కు సుభాష్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఇంతకుముందు సమర్పించిన పత్రానికి పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ తక్షణం స్పందించి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు లేఖ రాసి, నిజామాబాద్ డివిజన్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు వారిపై ఆధారపడిన వారు కలుపుకుని సుమారుగా 7500కు పైగా ఉన్నారని అన్నారు. వారందరు ఏ చిన్న ఆరోగ్య సమస్యకైనా హైదరాబాద్ వరకూ వెళ్ళవలసి రావడం వ్యయప్రయాసలతో కూడుకొని ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని నిజామాబాద్‌లో సిజిహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లైతే ఉద్యోగులు, పెన్షనర్లకు సౌలభ్యం ఏర్పడుతుందని అన్నారు. దీనికి పార్లమెంట్ సభ్యులు స్పందించి సంబంధిత మంత్రిత్వ శాఖను సంప్రదించి నిజామాబాద్‌లో సిజిహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు సహాయపడుతానని తెలియజేసారు. కార్యక్రమంలో ప్రతాపరెడ్డి, షేక్ హుస్సేన్, మోహన్ దాస్, ఈవిఎల్ నారాయణ, నారాయణ, నవీన్ కుమార్, ఎస్ఆర్ఓ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీకి వితని పత్రాన్ని అందజేస్తున్న కమిటీ సభ్యులు

బట్టాపూర్ తండాలో తీజ్ పండగ

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని బట్టాపూర్ గిరిజన తండాలో గురువారం మహిళలు తీజ్ పండగను ఘనంగా జరుపుకున్నారు. తలపై తీజ్ బుట్టలను పెట్టుకుని నృత్యాలతో ఊరేగింపుగా వెళ్ళారు. అనంతరం దేవికి మొక్కులు చెల్లించి, తీజ్ బుట్టలను చెరువులో నిమజ్జనం చేశారు. తండావాసులు తిరుపతి, భూక్యా సంతోష్, భీమా నాయక్, శివ, రమేష్, రవి, జగన్, వెంకట్, నందు, భూక్యా శ్రీను, మూడ్ దయానంద్ నాయక్ పాల్గొన్నారు.

28కి వాయిదాపడ్డ మున్సిపల్ వర్కర్స్ చర్చలు

- బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నిజామాబాద్ కామారెడ్డి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దండివెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ 19, 500 అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 17నుండి జరగాల్సిన మున్సిపల్ వర్కర్స్ సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయ్ యూనియన్ నిజామాబాద్ కామారెడ్డి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దండి వెంకట్ తెలిపారు. బుధవారం లేబర్ కమిషనర్ సమక్షంలో బిఎల్‌టీయూ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో చర్చలు జరిగాయన్నారు. ఈ చర్చల్లో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, లేబర్ కమిషనర్ విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకొని ఈనెల 28వరకు తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, వాటర్ సప్లయ్ యూనియన్ నాయకులు ఎ.హరిష్, కె. రాహుల్, ఆర్.మురళి గోపాల్, ఆర్. రాజేశ్వర్, కె.రతన్, హైమద్ పాషా, బాబు, ఎన్. వెంకట్ రమణ తదితరులు పాల్గొన్నారు.



చర్చల్లో పాల్గొన్న నాయకులు

జాతీయ జెండాల పంపిణీ, విద్యార్థుల ర్యాలీ



నవతెలంగాణ-ఆర్మూర్

హర్ ఘర్ తిరంగా లో భాగంగా ప్రధాని పిలుపు మేరకు బుధవారం పట్టణంలో గోల్ బంగ్లా, కమల్ నెహ్రూ కాలనీ, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ శివాలయం , హుస్నాబాద్ గల్లీ, వార్డ్ 33, 35వార్డుల్లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగొట గంగాధర్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలను గురువారం పంపిణీ చేశారు. స్వాతంత్ర సంబురాన్ని గౌరవంగా జరుపుకుందాం అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణధ్యక్షులు ద్యాగ ఉదయ్, కార్యదర్శి రమేష్ నాయకులు అశోక్ మంచిర్యాల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో...

పట్టణంలో తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థినీలు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ నహీద ఫిర్దోస్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో ర్యాలీ నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

రైల్వే స్వీపింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

- బిఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రైల్వే శానిటేషన్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్- బిఎల్ టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. మేడ్చల్, మెదక్, నిజామాబాద్, బోధన్ రైల్వే స్టేషన్‌ల పరిధిలో నడిచే రాయలసీమ, నాందేడ్, పూనే, పండరిపూర్ ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో స్వీపింగ్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్‌లోగల సంబంధిత సీనియర్ సెక్షన్ ఇంజనీరింగ్ కార్యాలయం వద్ద బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్-బి ఎల్ టి యు ఆధ్వర్యంలో కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిఎల్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్ రైల్వే శానిటేషన్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మోసిన్, రాజు, రాజమణి, విజయ, గౌస్, నిజామాబాద్, భోధన్, మెదక్, మేడ్చల్ లకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని పలు గ్రామాల్లో సిఎం రిలీఫ్ పండి చెక్కులను స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి లబ్దిదారులకు బుధవారం అందజేశారు. ఏడాది క్రితం సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి చొరవతో డబ్బులు విడుదల అయ్యాయన్నారు. వివిధ గ్రామాలకు ఎమ్మెల్యే వెళ్లి 390 చెక్కులు పంపిణీచేసినట్టు మండల అధ్యక్షులు సురేష్ తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలు, మతాలు, కులాలు చూడకుండా అందరికీ చెక్కులు వచ్చాయన్నారు. సెప్టెంబర్ నెల నుంచి రేషన్ కార్డు దరఖాస్తులు, పింఛన్ల దరఖాస్తులు పరిష్కరించడం జరుగుతుందని, తెలిపారు. ఇల్లు కూడా లేనివారికి మాత్రమే రూ. 5 లక్షల రూపాయలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు వినోద్, రమేష్ నాయక్, సంతోష్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గేట్లు వేసుకొని ఇంచార్జి బాధ్యతలు

నవతెలంగాణ-మాక్లూర్



మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యదర్శి ఇంఛార్జి బాధ్యతలను గేట్లు వేసుకొని నిర్వహించడంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ప్రాథమిక సహకార సంఘం కార్యదర్శి ఇప్పటి వరకు నాలుగో వ్యక్తికి బాధ్యతలు అప్పగించారు. వచ్చిన ప్రతి కార్యదర్శి సంఘంలో ఉన్న అవకతవకలపై భయాందోళన చెందుతున్నారు. దీంతో ఎవ్వరూ కూడా కార్యదర్శి బాధ్యతలను స్వీకరించడానికి ముందుకు రావడం లేదు. గత కార్యదర్శులైన సంతోష్, విష్ణు వర్ధన్ ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడంతో ఆలూరు మండల కేంద్రానికి చెందిన సొసైటీ కార్యదర్శి మల్లేష్‌కు బాధ్యతలను అప్పగించారు. ఆయన బాధ్యతలను స్వీకరించిన వారం రోజులకే వెనుదిరిగారు. ఇక్కడ కార్యదర్శి బాధ్యతలను చేపట్టడానికి ఎవ్వరూ కూడా ముందుకు రావడం లేదని, సొసైటీలో సినియార్టి ప్రకారం కార్యదర్శిని నియమించడానికి ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేసిన చేయడానికి ముందుకు రావడం లేదు. దీంతో సొసైటీ లోకి గత నాలుగు నెలల క్రితం ప్రవీణ్‌కుమార్ కంప్యూటర్ ఆపరేటర్‌గా వచ్చారు. ఆయనకు సొసైటీ బాధ్యతలను బుధవారం అప్పజెప్పారు.

వెల్కటూర్‌లో పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రారంభం



పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షులు అడ్వకేట్

నవతెలంగాణ-ఆర్మూర్

వెల్కటూర్ గ్రామం లో బుధవారం పత్రీజీ ఉచిత పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని పిఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో సైతం పత్రీజీ యొక్క శ్వాస మీద ధ్యాస ధ్యానాన్ని ఇంటింటికి తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో ఉచిత ధ్యాన కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంటింటికి ధ్యానం గడపగడపకు ధ్యానం మనిషి, మనిషికి ధ్యానం అనే నినాదంతో ఈ ధ్యాన కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతిరోజు ప్రతి ఒక్క మనిషి ధ్యానం చేసి ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ధ్యానం వల్ల అనేక మానసిక రుగ్మతలు, శారీరక సమస్యలు దూరం అవుతాయని మానవ జీవితంలో ధ్యానం అత్యవసరమని తెలిపారు. ఈ ధ్యాన కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో లలిత లింగమయ్య దంపతులు, సీనియర్ పిరమిడ్ మాస్టర్ నాగంపేట శ్రీనివాస్, పిరమిడ్ మాస్టర్లు రాజు, సత్యనారాయణ, దేవేందర్ రెడ్డి, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్‌కు అంక్సాపూర్ విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో ఇంటింటా ఇన్నోవేటర్ అనే కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంక్సాపూర్‌కు చెందిన శ్రీకాంత్, అభినవ్ కట్ చేసిన ప్యాడి డ్రైవింగ్ మెసేజ్‌కు ఎన్నిక అయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఆర్.మల్లీశ్వరి మాట్లాడుతూ గైడ్ టీచరుగా వ్యవహరించిన పసుపుల రఘునాథ్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమంలో ఈ ప్రాజెక్టులు ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇంటింటా ఇన్నోవేటర్ సర్టిఫికెట్లు కలెక్టర్ ద్వారా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్యాడి డ్రైవింగ్ మెసేజ్ అనేది గ్రామీణ ప్రాంతంలోగల వ్యవసాయదారులకు చాలా ఉపయోగంగా ఉటుందని అన్నారు. కోత కోసిన తర్వాత ధాన్యాన్ని రోడ్లపైన ఎండబెడతారు ఈ సందర్భంగా వారు చేతుల ద్వారా, కాళ్ళ ద్వారా ధాన్యాన్ని ఆరబోస్తారన్నారు. వారికి కాళ్ల నొప్పులు, వెన్ను నొప్పులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించడం కోసం ఈ పరికరాన్ని తయారు చేసినట్టు తెలిపారు.

దీని ద్వారా ఎంత ఎక్కువ ధాన్యమైన సులభంగా ఆరబోయవచ్చని, దీని తయారీకి తక్కువ ఖర్చు అవుతుందని అన్నారు. ఇది కరెంటు లేకుండా పనిచేస్తుందని, ఇది అందుబాటులో గల వస్తువులతో తయారు చేయవచ్చని తెలిపారు. వ్యవసాయదారులందరూ దీన్ని వాడడం వల్ల వారికి వచ్చే సమస్యలు పరిష్కారం అవుతాయని, గ్రామీణ ప్రాంతంలో గల వ్యవసాయదారులకు ఇది చాలా ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. ఇంటింటా ఇన్నోవేటర్లు ఈ ప్రాజెక్టు సెలెక్ట్ కావడం చాలా సంతోషంగా ఉందని గైడ్ టీచర్ పసుపుల రఘునాథ్ ఈ సందర్భంగా తెలిపారు. ఇంతకుముందు నాలుగు సార్లు ఇంటింటా ఇన్నోవేషన్లు తమ విద్యార్థులు సెలెక్ట్ కావడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు ఈ సందర్భంగా విద్యార్థులను గైడ్ టీచర్ పి రఘునాథ్, ఉపాధ్యాయ బృందం, విడిసి సభ్యులు అభినందించారు.



ఇన్నోవేటర్‌కు ఎంపికైన విద్యార్థులు

బదిలీలు చేపట్టాలని మోడల్ స్కూల్ టీచర్ల నిరసన

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు బదిలీలను చేపట్టాలని బాన్సువాడ మండలం కొత్తబాది గ్రామంలో గల ఆదర్శ పాఠశాల ఆవరణలో టీజీఎమ్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. బుధవారం ఉపాధ్యాయులు ఫ్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. 12 సంవత్సరాలుగా బదిలీలు లేకపోవడంతో ఉపాద్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అధికారుల పనికి నిరసనగా 21న హైదరాబాద్‌లో రిలే నిరాహార దీక్షకు సన్నదం అవుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ టీచర్లు, తదితరులు ఉన్నారు.


ఫ్లకార్డులతో నిరసన తెలుపుతున్న టీచర్లు

చిన్న మొత్తాల పొదుపుపై అవగాహన

నవతెలంగాణ-కామారెడ్డి

బీబీపేట్ మండలంలోని ఇస్సానగర్ గ్రామంలో తపాలా శాఖ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు చిన్న మొత్తాల పొదుపుపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తపాల శాఖ ఇన్‌స్పెక్టర్ సుజిత్‌కుమార్ ఆధ్వర్యంలో డాక్ డెవలప్మెంట్ ప్రోగ్రాం కింద గ్రామ ప్రజలకు చిన్న మొత్తాల పొదుపుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి తపాలా శాఖ సిబ్బంది ప్రజలకు చిన్న మొత్తాల పొదుపు గురించి సమగ్రంగా వివరించారు. అనంతరం గ్రామపంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో సేవింగ్ ఖాతాలు, ఇన్సూరెన్స్ స్కీమ్‌పై అవగాహన కల్పించారు. తపాలా శాఖ సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సుకన్య సమృద్ధి యోజన, పిపిఎఫ్ ఖాతా గురించి వివరించారు. కార్యక్రమంలో బిబిపేట ఎస్‌పిఎం నరసింహులు, యంవో వెంకటరామిరెడ్డి, స్థానిక బిపిఎంలు ఏబీపిఎంలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

రైతులు, మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యం

- కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్

నవతెలంగాణ-ఎడపల్లి

రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఇందుకు బ్యాంక్ అధికారుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలో కెనరా బ్యాంక్ బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించారు. గత 11 సంవత్సరాలుగా ఈ బ్యాంకు ఉండగా.. 11 సంవత్సరాల క్రితం ఇంటి యజమానితో అగ్రిమెంటు రూపంలో అధికా రులు అప్పట్లో రాసుకున్నారు. కాగా కాల పరిమితి పూర్తి కావడంతో నూతనంగా నిర్మించిన కెనరా బ్యాంకును అధికారికంగా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అటు రైతులు ఇటు స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదిగాలన్నదే బ్యాంకు అధికారుల లక్ష్యం అన్నారు. 11 సంవత్సరాల నుంచి ప్రస్తుతం వరకు 32 వేల కోట్ల రూపాయలను టర్నోవర్ చేసినట్టు ఆయన వివరించారు. మంగల్‌పాడ్ కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రావణ్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ రజిత, క్యాషియర్, సునీత, ఐకెపి ఎపిఎం సాయిలు, బ్యాంకు సిబ్బంది మల్లెపూల పోశెట్టి, సుజాత, స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులు, యువకులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జనరల్ మేనేజర్ శ్రీనివాస్

చదువుకు ప్రాధాన్య ఇవ్వండి..

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు చదువుకు ప్రాధాన్యత ఇచ్చి మొదటి స్థానంలో నిలిచినట్లయితే తమ బ్యాంకుల ద్వారా పేద విద్యార్థిని విద్యార్థులకు చేయూతని స్తామని జనరల్ మేనేజర్ శ్రీనివాస్ మంగల్‌పాడ్ కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రావణ్ కుమార్ అన్నారు. మంగల్‌పాడ్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ బాల బాలికలకు 2024-25 విద్యా సంవత్సరానికి గాను కెనరా విద్యా జ్యోతి పథకం కింద ఉపకార వేతనాలు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. మంజూరైన చెక్కులను అధికారులు వి ద్యార్థి విద్యార్థులకు అందజేశారు. 5, 6, 7వ తరగతి చదువుతున్న వారికి రూ.3వేల చొప్పున, 8, 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రూ.5000 చొప్పున చెక్కులు మంజూరు కావడంతో బ్యాంక్ అధికారులు బాలికలకు అందజేశారు.

వివాహితను వేధించిన కుటుంబ సభ్యులపై కేసు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

వివాహితను వేధించిన కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గడ్డం ప్రియాంక బాలాజీనగర్ తాండకు చెందిన రత్నావత్ నటరాజ్‌లు ఏడు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. గత కొన్ని నెలల నుంచి ప్రియాంక భర్త నటరాజ్, అత్త జున్ను, మామ హరి కలిసి పెళ్లి సమయంలో ఎలాంటి కట్నం ఇవ్వలేదని.. కట్నం తీసుకురావాలని ఆమెను బూతు మాటలతో తిడుతూ కొడుతున్నారని, కట్నం ఇవ్వకుంటే ఇంట్లోంచి వెళ్లి పోవాలని వేధిస్తున్నారని ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్లో బాధితురాలు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు 78వ స్వాతంత్ర్య శుభాకాంక్షలు

- కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ప్రజలకు, అధికారులకు, అనధికారులకు కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని వార్డులను పార్టీలకు అతీతంగా పట్టణాన్ని పరిశుభ్రంగా, అభివృద్ధి పరంగా ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా ఆమె మున్సిపల్ పరిధిలోని ప్రజలకు సూచించారు.

వేదవాహిని స్కూల్ గుర్తింపును రద్దు చేయాలి

- జుక్కల్ ఎంఈవో కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా



నిరసన తెలుపుతున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డిడెస్క్

నిబంధనలు పాటించని వేదవాహిని స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లాకార్యదర్శి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జుక్కల్ ఎంఈవో కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వినతిపత్రం ఇచ్చిన తరువాత కూడా పాఠశాల అదే విదంగా కొనసాగుతుందని, గ్రామ పంచాయతీ నుండి తీసుకోవాల్సిన భవన నిర్మాణ అనుమతి కూడా లేదని తెలిపారు. పూర్తి స్థాయిలో నిర్మాణం పూర్తికాకున్నా తరగతులు కొనసాగు తున్నట్టు తెలిపారు. సరియైన తరుగతి గదులు లేవని, నీటి వసతి లేదని, మరుగుదొడ్లు సైతం లేక విద్యార్థులు ఇక్కట్లకు గురవుతున్నట్టు తెలిపారు. అదే విధంగా భవన నిర్మాణం పని ముట్లు, సిమెంట్, స్టీల్ రాడ్, సామాగ్రి తరుగతి గదులల్లో నిలువ చేసి ఉంచారని తెలిపారు. పాఠశాల యాజమాన్యం పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారని విద్యార్థులకి ఎలాంటి ప్రమాదం జరుగకుండా, పాఠశాల భవన నిర్మాణం పూర్తి స్థాయిలో నిర్మించి పాఠశాల కొనసాగించేలా విద్యా శాఖ అధికారి స్పందించి ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవన నిర్మాణం పూర్తయ్యే వరకు పాఠశాలను మూసివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జుక్కల్ మండల అధ్యక్షులు షైక్ ఫిర్దోస్ మండల ఉపాధ్యక్షులు సునీల్, నాయకులు రాహుల్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి కెనరా బ్యాంక్ బ్రాంచ్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విద్యా జ్యోతి ఉపకార వేతనాల పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ కేటగిరికి చెందిన ఐదు నుంచి 10వ తరగతి చదువుకునే విద్యార్థులకు ప్రోత్సాహక బహుమ తులు అందించినట్లు ఎల్‌డిఎం రవికాంత్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి దయానంద్, డీఈఓ రాజు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ లాలూ నాయక్ చేతులమీదుగా నగదు బహుమతులు అందజేశారు. జిల్లాలో మూడు లక్షల రూపాయలు సిఎస్‌ఆర్ యాక్టివిటీలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్సీ, ఎస్టీ బాలికలకు ఇచ్చామని ఎల్డిఎం రవికాంత్ తెలిపారు. నగదు బహుమతులను పొందిన విద్యార్థులను అభినందించారు.

యుఎస్ఎఫ్ఐ బోధన్ డివిజన్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-బోధన్

యుఎస్ఎఫ్ఐ బోధన్ డివిజన్ నూతన కమిటీని బోధన్ పట్టణంలో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా రాజు, ప్రశాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ.. విద్యార్థి సమస్యలపై తాము నిరంతరం ఉద్యమించి విద్యార్థులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పెద్ది సూరి, యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్దాల నాగరాజు, యుఎస్ఎఫ్ఐ జిల్లా ఆఫీస్ బేరర్స్ గణేష్, మహేష్, బోధన్ డివిజన్ కమిటీ సభ్యులు నవీన్, కార్తీక్, ప్రసాద్, సంతోష్, సాయి, ఆజాద్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్యబోధన

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామం ప్రైమరీ పాఠశాలలోని అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు ఆట, పాటలు, కథలు, చిత్రలేఖనం తదిత అంశాలపై చిన్నారులకు విద్యా బోధన చేయనున్నట్లు అంగన్వాడీ టీచర్ పుష్ప పేర్కొ న్నారు. విద్య బోధనలో సృజనాత్మకతను వెలికి తీయడానికి బొమ్మల ద్వారా వారికి అవగాహన కల్పిస్తున్నామని ఆమె అన్నారు. గర్భిణులు, బాలింతలు, మహిళల పౌష్టికాహారంపై అవగాహన కల్పించామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బందితో పాటు గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

రామారెడ్డి అభివృద్ధికి సహకరించాలి

- కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు గిరెడ్డి మహేందర్‌రెడ్డి
- ఎంపీకి వినతి

నవతెలంగాణ-రామారెడ్డి

రామారెడ్డి మండల అభివృద్ధికి ఎంపీ నిధులు కేటాయించి, మండల అభివృద్ధికి సహకరించాలని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్‌ను కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు గీరెడ్డి మహేందర్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు.

పాస్‌బుక్ ప్రింట్ ఇవ్వట్లే

- యూనియన్ బ్యాంక్ ఎదుట ఖాతాదారుల ఆందోళన

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో బ్యాంక్ ఖాతా దారులకు బ్యాంక్ బ్యాలన్స్ చూసుకోడానికి పాస్‌బుక్‌లో ప్రింట్ ఇవ్వడం లేదని ఆరోపిస్తూ ఖాతాదారులు ఆందోళన చేపట్టారు. బ్యాంక్ ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. బ్యాంక్ సిబ్బంది ఎన్నిసార్లు ప్రింట్ అడిగిన ఇవ్వడం లేదని ఖాతా దారులు తెలిపారు. ఈ విషయం బ్యాంక్ మేనేజర్ అరవింద్ దృష్టి కి తీసుకెళ్లగా హెడ్‌ఆఫీస్‌కు ఫిర్యాదు చేయాలని ఉచిత సలహా ఇచ్చినట్టు వాపోయారు. బ్యాంక్ ఎదుట ఆందోళన చేస్తుండటంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఖాతాదారులను సముదాయించారు.



నితీన్‌ను యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులుగా గెలిపించాలి

- కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-వర్ని (రుద్రూర్)

కాంగ్రెస్ పార్టీ యువజన ఎన్నికలలో భాగంగా రుద్రూర్ మండల యూత్ అధ్యక్షులుగా నితిన్ పటేల్‌కు మద్దతు ఇవ్వాలని సులేమాన్‌నగర్ మాజీ సర్పంచ్ ఖాదర్, గ్రామ నాయకులు తెలిపారు. ఎన్నికలో నితిన్ పటేల్‌కు ఓటు వేసినట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అరుణ్ కుమార్, రానాంపల్లి శంకర్, షేక్ లాతిఫ్, సదర్, మాజీ కోపసేన్ దస్తగిరి, ఆరిఫ్, షాదుల్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్సైకి సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ పోలీస్ స్టేషన్‌కు ఇటీవల కొత్తగా వచ్చిన ఎస్సై విజయ్ కొండాకు మండలాల పరిధిలోని మాజీ సర్పంచులు పోలీస్ స్టేషన్‌లో శాలువాతో ఘనంగా బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాంతి భద్రత విషయంలో సహకరిస్తామని, ప్రజాసమస్యలకు తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని మాజీ సర్పంచులు ఎస్సైకి విజ్ఞప్తి చేశారు. ఎస్సై ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.



ఎస్ఐని సన్మానిస్తున్న దృశ్యం

కేటీఆర్ గతాన్ని మర్చిపోయి మాట్లాడకు

మాజీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

కేటీఆర్ అధికారంలో ఉండి గతంలో రైతులకు, నిరుద్యోగులకు, ఏమి చేయలేక, విద్యావ్యవస్థను మీరు ఏం చేసి, ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తున్నారని మాజీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీ ప్రభుత్వంలో యాదవులకు గొర్రెల పంపిణీ చేస్తామని, డబ్బులు చెల్లించిన యాదవులకు 30శాతం మాత్రమే గొర్రెల పంపిణీ చేసి మొండిచేయి చూపించారని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన చేపట్టక, నిరుద్యోగ భృతి ఇవ్వక నిరుద్యోగులను నిండా ముంచారని పేర్కొన్నారు.

జనం మెచ్చిన నేతకు ఘనంగా జన్మదిన వేడుకలు

బైక్ ర్యాలీతో స్వాగతం

నవతెలంగాణ-మద్నూర్

జనం మెచ్చిన నేతగా ముచ్చటగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజాసమస్యల పరిష్కారానికి నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేసిన జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంతుషిండే జన్మదిన వేడుకలు మండలంలోని మేనూర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వై.గోవింద్ ఇంటి వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే హనుమంతు షిండే జన్మదిన వేడుకలకు హాజరు కాగా ఆయనకు బైక్ ర్యాలీ ద్వారా మండల నాయకులు స్వాగతం పలికారు. కేక్ కట్ చేయించి అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. మాజీ ఎమ్మెల్యే హనుమంతు షిండేను నాయకులంతా శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజంసాగర్ మండల కేంద్రంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ఆశ జ్యోతి అయిన మాజీ ఎమ్మెల్యే హనుమంతు షిండే జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో అచ్చంపేట్ సొసైటీ చైర్మన్ నరసింహారెడ్డి, నాయకులు రమేష్‌గౌడ్, విటల్ తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న నాయకులు

పెండింగ్ బిల్లులు ఇప్పించండి

- ఎంపీడీవోకు మాజీ సర్పంచుల వినతి

నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లి మండలాల పరిధిలోగల 34 గ్రామపంచాయతీలలో గ్రామాల అభివృద్ధికి పాటు పడ్డామని, తమ పెండింగ్ బిల్లులు వెంటనే ఇప్పించాలని ఉమ్మడి మండలంలోని మాజీ సర్పం చులు మండల పరిషత్ కార్యాలయానికి తరలివచ్చి ఎంపీడీవో రానికి బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. అభివృద్ధి పనులు చేశాం.. ఎంబీ రికార్డులు ఉన్నాయి, ఒక్కొక్కరికి లక్షల రూపాయలు పెండింగ్ బిల్లులు ఉన్నట్లు, వీటితోపాటు మోటారు రిపేరింగ్, కరెంటు బల్బుల బిల్లులు, పారిశుధ్యానికి సంబంధించిన సామాగ్రి కొనుగోలు బిల్లులు, గత సంవత్సరం నుంచి పెండింగ్‌లోనే ఉన్నాయని సంవత్సరం కాలంగా పెండింగ్ బిల్లుల కోసం ఎదురు చూస్తున్నమని తెలిపారు. బిల్లులు అందకపోవడం తమ కుటుం బాలు రోడ్డున పడే పరిస్థితులు నెలకొ న్నాయని గ్రామాలలో పోటీపడి సర్పం చులు అభివృద్ధి పనులు చేస్తే ప్రభుత్వం తమ బిల్లులు చెల్లించకుండా మా జీవితాలతో చెలగాటం ఆడుతుందని పేర్కొన్నారు. దయచేసి ప్రస్తుతం గ్రామపంచాయతీలకు వచ్చినటువంటి 15 ఆర్థిక సంఘం నిధులను తమకు చెల్లించి తమ కుటుంబాలను ఆదుకోవాలని ఎంపీడీవోకు అందజేసిన వినతి పత్రంలో విజ్ఞప్తి చేశారు.


వినతిపత్రాన్ని అందజేస్తున్న మాజీ సర్పంచ్‌లు

ఓపెన్ స్కూల్ ద్వారా అడ్మిషన్లు ప్రారంభం

నవతెలంగాణ-బోధన్

ఓపెన్ స్కూల్ విధానం ద్వారా పదవ తరగతిలో, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు కల్పించడానికి ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసిందని బోధన్ ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ బాలచంద్రం, సహాయ కోఆర్డినేటర్ ఖైరాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చదువును మధ్యలో మానేసిన వారు 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుకోవాలనే సంకల్పమున్న వారికి 2024-25 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ షెడ్యూలు ప్రారంభమైందని తెలిపారు. 8.8.24 నుంచి 20.9.24 వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అపరాధ రుసుముతో 11.9.24 నుంచి 3.10.24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని బడి మధ్యలో మానేసిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు చేసుకునే వారు పాత పాఠశాలకు సంబంధించి టీసీ, బోనఫైడ్ సర్టిఫికెట్, లేదా బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, కులం సర్టిఫికెట్, రెండు ఫోటోలు, పైవన్నీ మూడు సెట్ల చొప్పున జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. ఇంటర్మీడియట్ కోసం దరఖాస్తు చేసేవారు టెన్త్ మెమో, టీసీ, కులం సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, రెండు ఫోటోలు రెండు సెట్ల జిరాక్స్ చొప్పున బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ)లో అందజేయాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మా వంతు కృషి

నవతెలంగాణ-నిజాంసాగర్

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మహాత్మా హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ కృషి ఉంటుందని సంస్థ ఫౌండర్ గంట రవీందర్ అన్నారు. బుధవారం నిజంసాగర్ మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 160 మంది విద్యార్థులకు ఆయన పాఠశాల టీ షర్టులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరుసగా మూడో సంవ త్సరం పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. మహాత్మా హెల్పింగ్ హాండ్స్ సభ్యులు, వడ్డేపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ప్రజా పండరి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో ప్రభుత్వ పాఠశా లలను బలోపేతానికి, విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కోసం సంస్థ ఎంతగానో ఖర్చుపెట్టి అనేక రకాల కార్యక్రమాలు చేస్తున్నమని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రామచందర్, పాఠశాల ప్రధానో పాధ్యాయులు గంగారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు ఫాతిమా, ఐఈఆర్టి గైని చిన్ని సాయి లు, నాయకులు నరేష్, అంజయ్య రాజారామ్ పాల్గొన్నారు.


టీషర్టులు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఎంపీఓ మలహరి

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీవో మలహరి గ్రామపంచాయతీ సిబ్బందికి, కార్యదర్శికి సూచించారు. బుధవారం మండలంలోని బానాపూర్ తండా పారిశుధ్య పనులను పాఠశాలను సందర్శించారు. గ్రామాల్లో తండాలో పారిశుధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మురికి కాల్వలో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని వెంటనే తొలగించాలని, మురికి కాల్వలకు ఇరువైపులా పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలన్నారు. దోమల మందును పిచికారీ చేయాలని సూచించారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో దోమలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలల్లో పౌష్టికాహారంతో పాటు విద్యార్థులు హాజరుపట్టిక గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీలో రికార్డులను పరిశీలించారు.


అవగాహన కల్పిస్తున్న ఎంపీవో

శ్రీ చైతన్య పాఠశాల పై చర్యలు తీసుకోండి

నవతెలంగాణ-ఆర్మూర్

వసూళ్ల దందా చేపడుతున్న శ్రీ చైతన్య స్కూల్ మీద చర్యలు తీసుకోవాలని టిఎన్ఎస్ఎస్ విద్యార్థి సేన జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేష్ నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని శ్రీ చైతన్య ఒలంపియాడ్ టెస్ట్ అనే ముసుగులో విద్యార్థుల వద్దనుంచి 3000 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని అన్నారు. సెక్షన్ పేరుమీద అదనంగా ఫీజ్ వసూలు చేస్తున్నారని తెలిపారు. ఎగ్జామ్ ఫీజ్ వేరే కట్టుకోవాలని మేనేజ్మెంట్ చెప్పడం సిగ్గుచేటని అన్నారు. ఇలా వసూళ్ళకి పాల్పడుతున్న స్కూల్‌పై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆ స్కూల్‌కి రెండో బిల్డింగ్‌కి పర్మిషన్ లేకపోయినా నడిపిస్తున్నారన్నారు. తక్షణమే శ్రీచైతన్య స్కూల్ నీ సీజ్ చేసి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు సాయి కిషోర్, దిలీప్, వికాస్, విఘ్నేష్, చరణ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా టై, బెల్ట్ ల పంపిణీ

నవతెలంగాణ-సిరికొండ

మండలం రావుట్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వందమందికి టై, బెల్ట్ లను ఉచితంగా అందజేశారు. రావుట్ల సొసైటీ డైరెక్టర్ బాబన్న, ఆయన సోదరుడు బాలకిషన్ టై, బెల్ట్ లకు ఆర్థిక తోడ్పాటును అందజేశారు. ఈసందర్భంగా పంపిణీ కార్యక్రమంకు స్కూల్ ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయురాలు విజేత అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి సోలమాన్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అందించే సహాయం సరిపోదు గ్రామాల్లోని యువత, గ్రామ ప్రజలు ఇలా తోడ్పాటును అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు బాలయ్య, గ్రామస్తులు, దామోదర్, సంజీవ్ కుమార్, ఉపాధ్యాయులు సుధాకర్, గోపాల్, సరిత, కళ్యాణి, శాంత, యువకులు భార్గవ్, . నవీన్, ప్రగ్నెస్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు పకడ్బందీ చర్యలు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి
- ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలి
- పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేపట్టాలి
- పచ్చదనం-స్వచ్ఛదనం నిరంతరం కొనసాగించాలి



వీసీలో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వర్షాకాలంలో ప్రబలే సీజన్ వ్యాధులను నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, వ్యాధులు ప్రబలకముందే క్షేత్రస్థాయిలో అన్ని చోట్ల ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని హితవు పలికారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలు, పచ్చదనం - పరిశుభ్రత అంశాలపై సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి సీ.ఎస్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష జరిపారు. ఆయా జిల్లాల వారీగా మలేరియా, డెంగ్యూ, చికన్ గున్యా, విషజ్వరాల పరిస్థితి గురించి ఆరా తీశారు. రాష్ట్రంలో ఈ సీజన్లో ఇప్పటివరకు 3698 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని తెలుపుతూ, ఒకింత వేగంగా విస్తరిస్తున్న13 జిల్లాలలో ఈ వ్యాధిని నియంత్రించేందుకు క్షేత్రస్థాయిలో విస్తృత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్ తదితర శాఖలు కూడా సమన్వయంతో పని చేస్తూ, సీజనల్ వ్యాధుల నివారణకు అంకితభావంతో కృషి చేయాలని అన్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరిస్తూ, అవగాహన కల్పించాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, ఓపెన్ ప్లాట్లు, జనావాసాల మధ్య ఎక్కడైనా నీరు నిల్వ ఉన్నట్లు గమనిస్తే ఆయిల్ బాల్స్ వేయాలని, గంబూషియా చేప పిల్లలను వదలాలని, పిచికారీ మందు వేయించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయించాలని అన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలని, వ్యాధుల పరిస్థితిపై రోజువారీగా నివేదికలు తెప్పించుకుని నిశిత పర్యవేక్షణ జరపాలని అన్నారు. డెంగ్యూ కేసు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని, పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. జిల్లా, రెవెన్యూ డివిజన్, పీ.హెచ్.సీ ల స్థాయిలో రాపిడ్ రెస్పాన్స్ టీమ్ లను ఏర్పాటు చేయాలని, ఎక్కడైనా సీజనల్ వ్యాధులు ప్రబలితే ఈ బృందాలు తక్షణమే స్పందించాలన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని, అన్ని నివాస గృహాలు, ప్రభుత్వ ప్రైవేట్ సంస్థలలో డ్రై డే చేపట్టి, నిలువ నీటిని పారబోసి దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటిని ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు సందర్శించాలని, ఇంటి లోపల, పరిసరాలలో నిలువ నీరు, చెత్త చెదారం లేకుండా చూసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పాఠశాలలు, వసతి గృహాలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు శుచి, శుభ్రతతో కూడిన భోజనం అందిస్తూ, ప్రతి ఒక్కరు చేతులు శుభ్రంగా కడుక్కునేలా వారికి జాగ్రత్తలు సూచించాలని, విద్యార్థులు ఆరోగ్యాల పట్ల అనునిత్యం అప్రమత్తంగా ఉంటూ క్షేత్రస్థాయి సిబ్బంది పర్యవేక్షణ తప్పనిసరి ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పాటు ప్రైవేట్ ఆసుపత్రులలో నమోదయ్యే సీజనల్ కేసుల వివరాలను కూడా సేకరించాలని ఆదేశించారు. ప్రైవేట్ హాస్పిటల్స్ ను సందర్శించి, నిబంధనలకు అనుగుణంగానే నిర్వహిస్తున్నారా? అన్నది పరిశీలించాలన్నారు. అవసరం లేకపోయినా టెస్టుల పేరుతో ప్రజలను ఆర్థికంగా నష్టపరుస్తూ, డెంగ్యూ వంటి వ్యాధుల పేరిట అనవసర భయాందోళనలకు గురిచేసే ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగానే ఫీజులు వసూలు చేసేలా పర్యవేక్షణ జరపాలని, ప్రతి ఆసుపత్రిలో తప్పనిసరిగా ఫీజుల వివరాలతో కూడిన బోర్డులు ఉండేలా చూడాలన్నారు.

కాగా, ఈ నెల 5 నుండి 9 వ తేదీ వరకు నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ఎంతో సత్ఫలితాలు అందించిందని సీ.ఎస్ శాంతికుమారి అన్నారు. దీనిని నిరంతరం కొనసాగిస్తూ, పల్లెలు, పట్టణాలలో పారిశుధ్య వ్యవస్థను మరింతగా మెరుగుపర్చేలా, పచ్చదనాన్ని పెంపొందించేలా చొరవ చూపాలని అన్నారు. ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా పర్యవేక్షించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, జిల్లా పంచాయతీ అధికారి చక్రవర్తి తరుణ్ కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన పుంశెట్టి లింగన్న ఇంట్లో గత నెల 19 న దొంగతనం చేసిన అంతర్ రాష్ట్ర నిందితులను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆర్మూర్ రూరల్ సీఐ కే శ్రీధర్ రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని చిట్టాపూర్ గ్రామంలో గత నెల 19వ తేదీన పుంశెట్టి లింగన్న ఇంట్లో సుమారు 8 తులాల బంగారం దోచుకెళ్లారు. ఈ ఘటనపై లింగన్న పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం పోలీసులకు నమ్మదగిన సమాచారం మేరకు ఆర్మూర్‌లో ఇద్దరు వ్యక్తులు అనుమానితంగా దొంగలించిన వస్తువులు అమ్మడానికి వస్తున్నారనే సమాచారం మేరకు బాల్కొండ ఎస్ఐ ఆధ్వర్యంలో నిందితులను జంబి హనుమాన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని విచారించగా చిట్టాపూర్‌లో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుండి ఆరు తులాల బంగారం రికవరీ చేశామన్నారు. మిగిలిన రెండు తులాల బంగారు ఆభరణాలు మనపురం గోల్డ్ లో ఫిక్స్ డిపాజిట్ చేశారని వాటిని లీగల్ గా విడిపించి బాధితులకు అందజేస్తామన్నారు. ఈ కేసులో నిందితులైన నాందేడ్ జిల్లాకు చెందిన మున్కర్ నామ్ దేవ్ ఇతనికి సహకరించిన మహాదేవ్ లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితులలో మున్కర్ నాందేవ్ అంతర్ రాష్ట్ర దొంగతనాలలో గతంలో వేల్పూర్, మోర్తాడ్, బాల్కొండ, ఆర్మూర్, భీమ్ గల్, బాన్సువాడ పోలీస్ స్టేషన్లలో పాత కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కేసు చేదించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్ఐ మొహమ్మద్ యాసీర్ అర్ఫాత్, హెడ్ కానిస్టేబుల్ విట్టల్, జయవంత్ రావు, కానిస్టేబుల్ లింగన్న, ప్రశాంత్, నరేష్, పవన్, రాకేష్‌ను సీఐ కె.శ్రీధర్ రెడ్డి అభినందించారు.

గోసంగిలను ఎస్సీ(ఏ) లో చేర్చాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పులో భాగంగా గోసంగిలను ఎస్సీ(ఏ) లో చేర్చాలని, అలా కానిపక్షంలో ఎస్సీ-(బి)లో చేర్చాలని జిల్లా గోసంగి సంఘం అధ్యక్షులు ఈర్నాల వినోద్ కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డిని గోసంగి సంఘం జిల్లా అధ్యక్షులు ఈర్నాల వినోద్ కుమార్ ఆధ్వర్యంలో కలిసి విన్నవించారు. ఎస్సీ(సీ)లో మాల ఉపకులం కింద ఉండడం వల్ల గోసంగి వారికి అన్ని విధాలుగా నష్టం జరుగుతుందని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఇందుకు సునీల్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. గోసంగి వారి సమస్యను, గోసంగి వారి స్థితిగతులు తనకు పూర్తిగా తెలుసన్నారు. గోసంగిల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ వర్గీకరణలో గోసంగి వారికి రిజర్వేషన్ పరంగా చాలా అన్యాయం జరుగుతుందని, తప్పకుండా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గోసంగి సంఘం ఉపాధ్యక్షులు సదుల్లా శ్రీనివాస్, జిల్లా సలహాదారులు ఈర్నాల లింగమయ్య, కమ్మర్ పల్లి మండల అధ్యక్షులు ఊరా నర్సయ్య, మోర్తాడ్ మండల సలహాదారులు గంధం శ్రీనివాస్, యువజన సంఘం సలహాదారులు పత్రి ప్రశాంత్, ఈర్నాల గంగాధర్, గడ్డం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలం కేంద్రంలోని పిహెచ్‌సి, ఘన్‌పూర్ ఉప కేంద్రం, ఇందల్ వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను బుధవారం అడిషనల్ కలెక్టర్ అంకిత్ రాజ్, డిఎంహెచ్ఓ రాజశ్రీ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా పై ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్‌ను వివరాలను అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ వ్యాధి ప్రబలిన రోగుల సంఖ్య, వారి గ్రామాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు అవుట్ పేషంట్‌లో జ్వరంకు సంబంధించి ప్రత్యేక రిజిస్టర్ పెట్టాలని తెలిపారు. ప్రతిరోజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోగల ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్త పని తీరును మెరుగుపరుచు కోవాలని ఆదేశించారు. దోమల నియంత్రణకు గ్రామ స్థాయిలో గల అధికారు లందరూ ఒక కమిటీగా ఏర్పడి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం గన్నారం ఆరోగ్య ఉప కేంద్రానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీ, జిల్లా ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ అంజన సందర్శించారు. డెంగ్యూ కేసు వివరాలు చేపట్టిన చర్యలు ఆరోగ్య కార్యకర్తను, గ్రామ పంచాయతీ సెక్రెటరీ శ్రీధర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి రాజ్ కాంత్ రావు, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జేమ్స్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సిసి నాగరాజ్, ఆనంద్, ఫార్మసిస్ట్ విజయలక్ష్మి, డాక్టర్ స్వప్న కీర్తన తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న డీఎంఅండ్‌హెచ్‌వో

యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-మోర్తాడ్



సాయికుమార్(ఫైల్)

మండల కేంద్రానికి చెందిన భోగ సాయి కుమార్ (28) కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సాయికుమార్‌కు మంగళవారం ఇంట్లో కుటుంబీకులతో ఘర్షణ కావడంతో మంగళవారం ఉదయం ఇంటి నుండి వెళ్లాడు. సాయి కుమార్ కనిపించకపోవడంతో స్నేహితులు కుటుంబీకులు బుధవారం ఉదయం గాలించారు. ఈక్రమంలో పాలెం రహదారి పక్కన ఉన్న వరద కాలువలో మృత దేహం కనిపించింది. సంఘటన స్థలానికి పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలలో పుట్టినరోజు వేడుకలు



పుట్టినరోజు వేడుక నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నలంద పాఠశాల కరస్పాండెంట్ లక్కారం ప్రసాద్ పుట్టినరోజు వేడుకలు బుధవారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించినారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ మండల సమాఖ్యగా కమ్మర్‌పల్లి

- మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు స్వీకరణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్ర స్థాయి ఉత్తమ మండల సమాఖ్యగా కమ్మర్ పల్లి ఎంపికయ్యింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ లో జరిగిన స్త్రీనిధి 11వ వార్షిక సమావేశంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నిజామాబాద్ జిల్లా కమ్మర్ పల్లి మండలంకు రాష్ట్రంలోనే ఉత్తమ మండల సమాఖ్య విభాగంలో మొదటి బహుమతికి ఎంపికవగా రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందజేశారు. ఐకెపి ఎపిఎం కుంట గంగాధర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రోజా రాణి ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో ఉన్న మొత్తం 594 మండలాల్లో కమ్మర్‌పల్లి మండలం మొదటి స్థానంలో నిలిచింది. మండలంలో రుణాల పంపిణీ, రికవరీ, ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల ఏర్పాటు వంటి అంశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు రాష్ట్రంలోనే మొదటి స్థానం సాధించిన మండల సమాఖ్యకు ఈ అవార్డు పంపిణీ చేసినట్లు ఏపీఎం గంగాధర్ పేర్కొన్నారు. కలెక్టర్, డిఆర్డిఏ ఉన్నత అధికారుల సలహాలు సూచనలతోపాటు మండలంలోని ఆరుగురు సీసీలు రవికుమార్, శ్రీనివాస్, నవీన్, భాగ్యలక్ష్మి, పీర్య, అలేఖ్యలతో పాటు 29 వీవోఏలు కమ్మర్‌పల్లి మండల సమాఖ్య సిబ్బంది అంతా కలిసి చేసిన సమిష్టి కృషి వల్లనే ఈ అవార్డు సాధ్యమైందని ఏపిఎం వివరించారు. కాగా రాష్ట్రంలో 33 జిల్లాల్లో నిజామాబాద్ జిల్లా మొదటి స్థానంలో నిలవగా జిల్లా డిఆర్డిఓ సాయాగౌడ్ అవార్డు అందుకున్నట్లు గంగాధర్ వెల్లడించారు. ఈ అవార్డుల ప్రధానం కార్యక్రమంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ కుమార్, సేర్ప్ సీఈవో దివ్య, స్త్రీనిధి ఎండి విద్యాసాగర్ రెడ్డి పాల్గొన్నారు.



మంత్రి సీతక్కద్వారా అవార్డు అందుకుంటున్న ఏపీఎం, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు

సుద్దపల్లి గురుకులంలో కౌన్సిల్ ఎన్నికలు



మాక్ ఎన్నికలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని సుద్దపల్లిలోగల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో బుధవారం కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. అనంతరం కెప్టెన్, వైట్ కెప్టెన్, కల్చరల్ సెక్రెటరీ, స్పోర్ట్స్ సెక్రెటరీ, లిటరరీ సెక్రెటరీను ఎన్నుకొవడానికి ఈఎన్నికలు నిర్వహించి ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం ఎన్నికల్లో సరైన వ్యక్తులను ఎన్నుకొన డానికి అవగాహన కల్పించడానికి ఈ ఎన్నికలు దోహదపడతాయని పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ నళిని వివరించారు. విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి ఈ ఎన్నికల ప్రక్రియ చేపట్టినట్లు నళిని తెలిపారు. 78 వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా విద్యార్థినులకు, సిబ్బంది కి వివిధ రకాల ఆటలపోటీలు నిర్వహించి 15న బహుమతులను ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

చిన్నారుల జెండావందనం

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ గ్రామానికి చెందిన అంగలి నవీన్ రెడ్డి స్వతంత్ర దినోత్సవం సందర్భంగా హార్ గర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా బుధవారం తన యోగా శిష్యులైన చిన్నారులకు దేశ ప్రాధాన్యత తెలిసేలా దేశభక్తి పెంపొందించేలా పలు విన్యాసాలను చేయించారు. ఈకార్యక్రమంలో చిన్నారులు అక్షర, ఆకృతి, కన్నయ్య, కుషి, చిన్ను తదితరులు పాల్గొన్నారు.



సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులకునేషనల్ అచీవర్స్ అవార్డ్

నవతెలంగాణ-ఏర్గట్ల

78 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా హ్యూమన్ రైట్స్ జిల్లా డైరెక్టర్ సామంత్ రెడ్డికి, ఆర్మూర్ నియోజకవర్గ చైర్మన్ నరేష్ గౌడ్ కు బుధవారం హ్యూమన్ రైట్స్ నేషనల్ చైర్మన్ కొప్పుల విజయ్ కుమార్,హైకోర్టు జడ్జి చంద్రకుమార్, సైకాలజిస్ట్ పద్మ కమలాకర్ చేతుల మీదుగా నేషనల్ అచీవర్స్ అవార్డ్ అందజేశారు.ఈ సందర్భంగా బట్టాపూర్ గ్రామవాసులు సామంత్ రెడ్డి, నరేష్ గౌడ్ మాట్లాడుతూ... సంస్థలో చేరిన అతికొద్ది రోజుల్లోనే ఈ అవార్డ్ ను అందుకోవడం ఆనందంగా ఉందని అన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్ఓసి అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపాలిటీలోని కోటార్మూర్ (పెర్కిట్)కి చెందిన దొండ రాములు అనారోగ్యంతో బాధపడుతుండటంతో 5వ వార్డు కౌన్సిలర్ శాల ప్రసాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ వినయ్ రెడ్డికి తెలుపగా ఆయనను నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో దొండ రాములు చికిత్సకోసం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్‌రెడ్డి స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 2లక్షల50వేలు రూపాయల ఎల్ఓసి అందజేశారు. నిమ్స్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించేలా చూడాలని కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలకేంద్రానికి చెందిన కో-ఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆత్మ నిర్భర్ భారత్, జీవ వైవిధ్యం, వ్యవసాయ సమృద్ధి ద్వారా నూతన భారత్ ఆవిష్కరణ అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బ్యాంక్ మేనేజర్ జి.దేవేందర్ బహుమతులను అందజేశారు. అలాగే బ్యాంక్ సిబ్బంది శ్రీకాంత్, బాలంరాజు, రవళి, అనే ముగ్గురు విద్యార్థుల యూనిఫామ్‌ల కోసం స్వంతంగా 5 వేల రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని ప్రైవేటీకరించొద్దు

- తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్

నవతెలంగాణ-ఆర్మూర్

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరణ చేయవద్దని తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోపునూరు చక్రపాణి అన్నారు. పట్టణ రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఎందు బుధవారం మధ్యాహ్న భోజన కార్మికులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూమధ్యాహ్న భోజన పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిర్వీర్యం చేయటానికి ముందుకు వస్తుందన్నారు. ఈ పథకాన్ని ప్రైవేటీకరణ చేస్తే రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన చేసి ఈ పథకాన్ని కాపాడుకుంటా మన్నారు. ఈ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం 10వేలు వేతనం ఇవ్వాలని ప్రతినెల ఐదవ తేదీన బిల్లులు జీతాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువులు, గ్యాస్ , కోడిగుడ్లతో సహ సరఫరా చేసి పిల్లలకు నాణ్యమైన భోజనం అందించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. లేకుంటే రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ధర్నా చేపడతామన్నారు. అంతకుముందు ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గంగాధర్, విజయలక్ష్మి, పోసాని, లక్ష్మి, గంగామణి, కార్మికులు పాల్గొన్నారు.

ఉపన్యాస పోటీలలో ద్వితీయస్థానంలో మలేహ మహేక్



నవతెలంగాణ-పిట్లం

రాష్ట్ర స్థాయి ఉపన్యాస పోటీలలో మండల కేంద్రానికి చెందిన బ్లూబెల్స్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని మలేహ మహేక్ ద్వితీయ స్థానం సాధించడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రపతి నిలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీలకు గాను బ్లూబెల్స్ పాఠశాల విద్యార్థిని మలేహ మహేక్ జూనియర్ రెడ్‌క్రాస్ కామారెడ్డి తరపున పాల్గొని ద్వితీయ స్థానంలో బహుమతి కైవసం చేసుకున్నట్టు వివరించారు. రాష్ట్రస్థాయిలో ఎన్నోవందల పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నప్పటికీ ఈ పోటీలలో బ్లూబెల్స్ విద్యార్థినికి ద్వితీయ బహుమతి రావడం అభినందనీయమన్నారు. 15న నిర్వహించే స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో తమ పాఠశాల విద్యార్థిని బహుమతి అందుకోవడం హర్షించదగ్గ విషయమని ఆయన కొనియాడారు.

ప్రభుత్వ సలహాదారుడిని కలిసిన మాజీ సర్పంచులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామ, ఇసన్నపల్లి తాజా మాజీ సర్పంచులు నర్సింలు యాదవ్, రాములు ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీని బుధవారం కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పదవి కాలంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించే విధంగా చూడాలని కోరారు. అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడుతూ ముఖ్యమంత్రితో మాట్లాడి పెండింగ్ బిల్లులు మంజూరు అయ్యేవిధంగా కృషి చేస్తానని తెలిపారు.



గురు గ్రూప్ ఆఫ్ కాలేజెస్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

- ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన పట్టణ సీఐ



మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలో గురు గ్రూప్ ఆఫ్ కాలేజెస్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి హాజరై మూడు రంగుల జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. కామారెడ్డిలో యువత ఎలాంటి చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా క్రమశిక్షణతో కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాలల చైర్మన్ గురువేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో దేశప్రగతికి అవసరమయ్యే విద్యను అభ్యసించి దేశ ఉన్నతికి విద్యార్థులు తమవంతుగా చేయవలసిన కర్తవ్యాలను చేయాలని సూచించారు. దేశభక్తిని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, విజయ్‌కుమార్, సత్యం, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

పలుచోట్ల బంద్



మూసిఉన్న దుకాణాలు

నవతెలంగాణ-లింగంపేట్

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా భారతీయ జనతా పార్టీ కేంద్ర కమిటీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం లింగంపేట్‌లో బందు సంపూర్ణంగా విజయవంతమైంది. ఉదయం నుండి వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా మూసివేశారు జనం లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఒకరోజు ముందుగా బిజెపి నాయకులు బందుకు సహకరించాలని వ్యాపార సముదాయాల యజమానులకు సూచించడంతో సంపూర్ణంగా బందును పాటించారు ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా లింగంపేట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి ప్రధాన కూడా లీల వద్ద విద్యాసంస్థల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు ఉదయం నుంచి సాయంత్రం 5 గంటలకు బంధు సంపూర్ణంగా విజయవంతమైంది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఈ.లక్ష్మీనారాయణ



నూతన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ ఈ.లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఈ.లక్ష్మీనారాయణ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. గతంలో నిజామాబాద్‌లోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ ఈ.లక్ష్మీనారాయణ ఇటీవలి సాధారణ బదిలీల్లో ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రభుత్వ పాలనా శాస్త్ర సహాయ ఆచార్యులుగా బదిలీఅయ్యారు. ఆయనతో పాటుగా చరిత్ర విభాగంలో డాక్టర్ ఎం.చంద్రకాంత్, తెలుగులో సహాయ ఆచార్యులు డాక్టర్ వి.శంకరయ్య, కామర్స్ సహాయ ఆచార్యులు జె.శివకుమార్ కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి బదిలీపై వచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ లక్ష్మీనారాయణను కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. అనంతరం బోధన, బోధనేతర సిబ్బందితో జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి ప్రాంత విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి, కళాశాలను మరింత అభివృద్ధి పరచడానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రకాంత్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వి.శంకరయ్య, కామర్స్ విభాగాధిపతి జె.శివకుమార్, అధ్యాపకులు అమరేశం ప్రభాకర్‌రావు, అరుణ్ కుమార్, గంగారెడ్డి, సిద్ధురాజ్, కృష్ణప్రసాద్, వినయ్‌కుమార్ శశిధర్, సంతోష్, రాణి, చంద్రకాంత్, గోదావరి, కార్యాలయ సూపరింటెండెంట్ వసంతలక్ష్మి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదును వేగవంతం చేయాలి

- జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్

నవతెలంగాణ-రెంజల్

మండల పరిధిలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో వరి నాట్లు వేసిన రైతుల పంట నమోదు కార్యక్రమాలను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి, మండల ప్రత్యేక అధికారి స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని బాగేపల్లి గ్రామ శివారులో పంటల నమోదు కార్యక్రమంలో భాగంగా ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా పరిధిలోని వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పంటలను నమోదు కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో భద్రపరచాలని ఆయన సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి,



వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

రైతు వేదికలో మొక్కలు నాటిన మండల ప్రత్యేక అధికారి..

మండల కేంద్రమైన రెంజల్ రైతు వేదికలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మండల ప్రత్యేక అధికారి వాజిద్ హుస్సేన్, మండల వ్యవసా య అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి మొక్కలు నాటే కార్యక్ర మంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మ కంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలను చేప ట్టాలని వారు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, వ్యవసాయ విస్తీర్ణాధికారి ప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ 14వ సామాజిక తనిఖీ

నవతెలంగాణ-బిచ్కుంద

ఉపాధిహామీ 14వ సామాజిక తనిఖీ ప్రజావేదికను బిచ్కుంద మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలో బుధవారం నిర్వహించారు. సామాజిక తనిఖీ 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలో 27 గ్రామపంచాయతీలో వివిధ పనులకు సంబంధించిన ఈజీఎస్ ద్వారా ఒక కోటి 34 లక్షల 60వేల 278 రూపాయల పనులు జరిగాయని, పంచాయతీరాజ్ పనులు రెండు కోట్ల 75లక్షల 22వేల 966 రూపాయల పనులు జరిగాయని వాటికి సంబంధించిన పనుల ఆడిట్ ఈనెల 2 నుంచి 13 వరకు జరిగిన సామాజిక తనిఖీ పూర్తి వివరాలు ప్రజావేదికలో పరిశీలించారు. ఉపాధి హామీ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో జరిగిన పనుల్లో అవినీతి జరిగిందని ప్రతి ఒక్క పైసా సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీ చేస్తామని అన్నారు. కొన్నిచోట్ల నాటిన మొక్కల బిల్లులు పొందుపరచలేదని, ప్రభుత్వ భూముల్లో గాని అటవీ భూముల్లో పనులు చేసేటప్పుడు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తప్పకుండా తీసుకోవాలని అన్నారు. మండలంలోని గ్రామపంచాయతీల పరిధిలో జరిగిన పిఆర్ పనుల రికార్డులు తనిఖీ బృందానికి ఇవ్వలేదని కూలీలు పనులకు హాజరు కాకుండా అటెండెన్స్ వేసినట్లు తమ దృష్టికి వచ్చిందని 27 గ్రామ పంచాయతీల రికార్డులను సరిగా మెయింటైన్ చేయలేదని తనిఖీ బృందానికి సమర్పించలేదని ఇలాంటి విషయాలు పునరావృతం కాకుండా చూసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఆడిట్ ఎస్ఆర్పి రంజిత్ కుమార్, సోషల్ ఆడిటర్ ప్రశాంత్, ఎండిఓ గోపాలకృష్ణ, ఏపీఓ తిరుపతి, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.



ప్రజావేదికలో మాట్లాడుతున్న పలువురు

యువతతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

- కెనరా బ్యాంక్ బ్రాంచ్ జీఎం శ్రీనివాస్

నవతెలంగాణ-ఎడపల్లి

యువతతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, మంగళ్‌పాడ్ కెనరా బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ శ్రావణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలో నూతనంగా నిర్మించిన కెనరా బ్యాంక్ బ్రాంచ్‌ను బ్యాంక్ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు జీఎం శ్రీనివాస్, బ్రాంచ్ మేనేజర్ శ్రావణ్ కుమార్ మాట్లాడారు. యువత ఆర్థికంగా వ్యాపార రంగాలలో రాణించేందుకు ముందుకు వస్తే తమ బ్యాంక్ అధికారులు సహకరిస్తారన్నారు. చిరు వ్యాపారాలు చేసుకునే యువత మహిళలు ముందుకు వస్తే కెనరా బ్యాంక్ అధికారుల సహకారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌ను, మంగళ్‌పాడ్ కెనరా బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ శ్రావణ్ కుమార్‌తో పాటు, యువకులు అరుణ్ కుమార్‌గౌడ్, స్వరాజ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, ఐకెపి ఎపిఎం సాయిలుతోపాటు పలువురు శాలువాలతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ రజిత, సునిత, బ్యాంకు సిబ్బంది మల్లెపూల పోశెట్టి, సుజాత, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.



కెనరా బ్యాంక్ బ్రాంచ్ జీఎం శ్రీనివాస్‌ను సన్మానించిన పలువురు

మత్తు పదార్థాలతో జీవితం నాశనం చేసుకోవద్దు

- గంజాయి నిర్మూలనపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-దోమకొండ

గ్రామాల్లో ప్రజలు, యువత సారాయి, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని సంగమేశ్వర్ గ్రామంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి, అత్యంత ప్రమాదకరమైన మత్తు పదార్థాలు, సారాయి నిషేధంపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో మత్తు పదార్థాల వలన జరిగే అనార్థాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను విక్రయిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తేవాలని, వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ కానిస్టేబుల్లు సాగర్, శ్వేత, పంచాయతీ కార్యదర్శి వసంత సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మహంకాళి అమ్మవారి ఆలయ ఆవరణలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై సందేహాలు తీర్చిన అధికారులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని ఏఈఓ కార్యాలయం రైతు వేదికలో రైతు రుణమాఫీపై రైతుల సందేహాలను తీర్చడానికి, రైతుల కోసం బుధవారం ఏఈఓ రాకేష్ ఆన్‌లైన్‌లో ఎంక్వయిరీ చేసి సలహాలు సూచనలు చేశారు. సన్నరకం వరి పంటను సాగు చేసిన రైతులు తప్పకుండా వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. వరి ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే రైతులు పంట నమోదు తప్పనిసరని సూచించారు.

కామారెడ్డిలో స్వచ్ఛత క్లీన్ అండ్ గ్రీన్

నవతెలంగాణ-కామారెడ్డి

వాటర్ సప్లై వద్ద మున్సిపల్ కమిషనర్ సుజాత ఆధ్వర్యంలో స్వచ్ఛత క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సుజాత మాట్లాడుతూ.. బుధవారం వాటర్ వార్స్ విభాగంలో చెట్లపొదులు, పిచ్చిమొక్కలు తొలగించారు. అలాగే కామరెడ్డి పట్టణ ప్రజలు పురప్రముఖులు వర్షాకాలంలో మున్సిపల్ వారి సిబ్బందికి సహకరించాలని, ఇండ్ల ముందు ఉన్న తొట్టిలలో, నల్ల గుంతల్లో నీటిని నిల్వ ఉంచొద్దని సూచించారు. దీనివలన వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన కలరా, డెంగ్యూ, మలేరియా లాంటి అంటువ్యాధులు రాకుండా ఉండాలంటే నీటిని మన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలని దానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలోని పుల్కల్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే పురుషోత్తం పటేల్ వారి అనుచరులను కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరి మోసపోయారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తోన్న కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వందల సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరడం శుభ పరిణామమని తెలిపారు. అందరం కలిసి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు ధర్పల్లి గంగాధర్, సీనియర్ నాయకులు మల్లికార్జునప్పా, పీసీసీ డెలిగేట్ విట్టల్‌రెడ్డి, సంతోష్‌పటేల్, వెంకట్‌పటేల్, గోపాల్ రెడ్డి, గుండ మొగులయ్య, రామ్‌రెడ్డి, సిద్ధరాం పటేల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగిల్‌విండో ఆర్థిక లావాదేవీలపై పరిశీలన



వినతిపత్రాన్ని అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని నల్లమడుగు సహకార సంఘంలో బుధవారం సంఘం లావాదేవీలపై అధ్యయనం చేసినట్టు అశోక్‌గౌడ్ తెలిపారు. ఉమెన్ రిసోర్స్ పాలసీలో భాగంగా తెలంగాణ కోఆపరేటివ్ యూనియన్ హైదరాబాద్ వారి సూచన మేరకు నల్లమడుగు సింగిల్ విండో చేరుకొని సంబంధిత కార్యదర్శి ఆర్థిక లావాదేవీలు, విధి నిర్వహణలో సంఘం బాధ్యతల గురించి అనుమతి ఇవ్వాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈనెల 14 నుంచి 22 వరకు ప్రిన్సిపల్ డైరెక్టర్ భూక్య వెంకన్న ఆదేశానుసారం ప్రాజెక్టు రిపోర్ట్ తయారు చేస్తున్నట్టు తెలిపారు. నల్లమడుగు సొసైటీలో విధులు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఈ బాధ్యతలను స్వీకరించినట్టు వివరించారు.

మానవ అక్రమ రవాణా, మత్తు పదార్థాలపై అవగాహన

నవతెలంగాణ-కామారెడ్డి

స్ఫూర్తి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో కళాబృందం విద్యార్థిని విద్యార్థులకు వివిధ విషయాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కామారెడ్డి పట్టణంలో స్ఫూర్తి ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యాలయంలో కళాబృందం నిర్వహించిన కార్యక్రమానికి కామారెడ్డి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, షీటీం, హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ క్రైమ్, రోడ్ సేఫ్టీ, బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణా నిర్మూలన, డ్రగ్స్, మత్తు పదార్థాలు గురించి మాట్లాడి విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. షీటీం 8712686094, సైబర్ నేరాల పట్ల టోల్ ఫ్రీ 1930 నెంబర్‌కు కాల్‌చేసి వినియోగించుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల టోల్‌ఫ్రీ నెంబర్ 100, 108, 1930, 181కు సమాచారం ఇస్తే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సాయం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యుడు ప్రభాకర్, సిబ్బంది, షీటీం సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అధిక ధరలకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు

నవతెలంగాణ-నిజాంసాగర్

అధిక ధరలకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం ఉమ్మడి మండలంలోని ఎరువుల దుకాణాలను, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆధార్ కార్డు తీసుకువచ్చిన రైతులకు ఇపిఓఎస్ యంత్రం ద్వారా మాత్రమే రైతులకు ఎరువులు విక్రయించాలని ఆమె దుకాణదారులను ఆదేశించారు. యూరియా, ఇతర ఎరువుల నిలువలు, నిలువ పట్టికలు, నిల్వ రిజిస్టర్లు ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అమర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

- అడ్డొస్తే చంపేస్తామని భయభ్రాంతులకు గురిచేస్తున్న మాఫియా
- జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసిన తహసీల్దార్



నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలోని ఖత్గాం, షెట్లూర్, హస్గుల్, పుల్కల్ మంజీర పరివాహక ప్రాంతం నుంచి రాత్రి సమయాల్లో అనుమతులు లేకుండా ట్రాక్టర్లు, లారీల ద్వారా అక్రమ ఇసుక రవాణా జరుగుతుండడంతో అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాను అరికట్టేందుకు తహసీల్దార్ సురేష్ గ్రామ రెవెన్యూ అధికారులను హస్గుల్, సిర్‌సమందర్ గ్రామాల వద్ద డ్యూటీలు వేశారు. మంగళవారం రాత్రి గ్రామ రెవెన్యూ అధికారులు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకోవడంతో ఇసుక మాఫియా దారులు బెదిరింపులకు పాల్పడ్డారు. ట్రాక్టర్లకు అడ్డు వస్తే చంపేస్తామని బెదిరించడంతో భయభ్రాంతులకు గురైన గ్రామ రెవెన్యూ అధికారులు బెదిరింపుల విషయాన్ని బుధవారం తహసిల్దార్ సురేష్ దృష్టికి తీసుకువచ్చారు. రాత్రి సమయాల్లో గ్రామ రెవెన్యూ అధికారులకు రక్షణ కల్పించాల్సిందిగా బిచ్కుంద ఎస్సైని కోరగా పూర్తిస్థాయి పోలీస్ సిబ్బంది లేరని తెలిపారని తహసీల్దార్ అన్నారు. లిఖితపూర్వకంగా స్థానిక పోలీస్ స్టేషన్లో, ఆర్డిఓ, బాన్సువాడ డిఎస్పికి, జిల్లా ఎస్పీకి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు ఈ సందర్భంగా తహసిల్దార్ సురేష్ తెలిపారు.

పట్టుకున్న ఇసుక లారీలకు రూ.25వేలు జరిమానా..

రాత్రి సమయంలో నదులు లేకుండా అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని పట్టుకుని రూ.25వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ సురేష్ తెలిపారు. హజబుల్ గ్రామ సమీపాన విచ్చేసిన ఇసుక డంప్‌లకు వేలంపాట నిర్వహించగా 11వేల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు జమ చేసినట్టు వివరించారు. ఇప్పటివరకు ప్రభుత్వ అనుమతులు లేకుండా తరలిస్తున్న ట్రాక్టర్లు, టిప్పర్లు, లారీలు పట్టుకొని వాల్టా చట్టం కింద 12,20,015 రూపాయలు జరిమానా విధించి ఆ డబ్బులను ప్రభుత్వ ఖజానాకు జమ చేసినట్టు వివరించారు.